విద్యా శాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఈ విజయాలు మరోసారి నిరూపించాయి. విజన్ ఉన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీసుకుంటున్న చర్యల వల్లే ప్రభుత్వ విద్యారంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయి.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 15.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 23 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## పేద విద్యార్థులకు వరంగా...

# మంత్రి లోకేష్ విజన్

### ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు జాతీయ స్థాయి గుర్తింపు

### ఎమ్మెల్సీ ఆలపాటి ఆధ్వర్యంలో టాప్ విద్యార్థులకు ఘన సన్మానం

### 65 మంది మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు - 62 పాఠశాలల హెచ్ఎంలకు ప్రత్యేక గౌరవం

### "వినయం, క్రమశిక్షణ, కృషితోనే మహోన్నత విజయాలు" - కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్





2 లో


మంగళగిరి (జరలిస్ట్ ఫైల్): సమాజహిత కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి విజయాల వెనుక నిలిచిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ చేపట్టిన సన్మాన కార్యక్రమంపై సర్వత్ర ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేయడమే కాకుండా, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం కల్పించడం విశేషంగా నిలిచింది.

ఇప్పటివరకు కార్పొరేట్ విద్యాసంస్థల వైపు మొగ్గుచూపిన వందలాది మంది తల్లిదండ్రుల చూపు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లుతోందనే చర్చ విద్యావర్గాల్లో వినిపిస్తోంది. ప్రభుత్వ బడుల ఫలితాలు, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల అంకితభావం ప్రజల్లో కొత్త నమ్మకాన్ని పెంచుతున్నాయి. ఈ మార్పుకు కారణం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణలేనని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తుండగా, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే దిశగా వినూత్న నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆలపాటి పేర్కొంటున్నారు. పేరెంట్-టీచర్ సమావేశాలు, ఉపాధ్యాయ నియామకాలు, విద్యార్థుల ప్రోత్సాహక కార్యక్రమాలు, ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యలు గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని అంటున్నారు.

"ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల్లో అపారమైన ప్రతిభ ఉంది. సరైన ప్రోత్సాహం, మార్గనిర్దేశం ఉంటే వారు దేశానికి గర్వకారణంగా నిలుస్తారు" అనే నమ్మకంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ విద్యారంగంలో జరుగుతున్న సానుకూల మార్పులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## ఖనిజాలకు 'విలువ' జోడింపు!



### పన్ను ఎగవేతలను అరికట్టేందుకు ఏఐ టెక్నాలజీ టూల్స్

### 2026-27 ఏడాదికి రూ.1,27,506 కోట్ల ఆదాయం లక్ష్యం

### ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టే ప్రయత్నాలను ముమ్మరం చేయడంతోపాటు... రాష్ట్రానికి వచ్చే సొంత ఆదాయాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని... వీటి ద్వారా మరింత ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. గురువారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. శాఖల వారీగా ప్రభుత్వానికి సమకూరుతోన్న ఆదాయాలపై చర్చించారు.

మిగతా 2లో...

### దేశానికి రక్షణ కవచంలా

## రాయలసీమ ప్రాజెక్టులు

- రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు పుట్టపర్తిలో శంకుస్థాపన
- డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో మరో 12 ప్రాజెక్టులకూ భూమి పూజ
- నేడు రక్షణ మంత్రితో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం

3 లో



### సీఎం చంద్రబాబు

## వాహన శ్రేణి కుదింపు

- ప్రధాని మోదీ పిలుపుతో కాన్వాయ్ తగ్గించుకున్న ముఖ్యమంత్రి

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వాహన శ్రేణిని కుదించుకున్నారు. మొత్తం 12 వాహనాల కాన్వాయ్‌ను 4 వాహనాలకు తగ్గించుకున్నారు. ఇవాళ్టి నుంచే ఈ వాహన శ్రేణి కుదింపును అమల్లోకి తీసుకురావాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశానికి కేవలం నాలుగు వాహనాల కాన్వాయ్‌తోనే సీఎం చేరుకున్నారు. ఇక నుంచి ఈ నాలుగు వాహన కాన్వాయ్ శ్రేణితోనే ప్రయాణించాలని సీఎం నిర్ణయించారు. అటు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ మేరకు వాహన శ్రేణిని తగ్గించుకుని ఇంధనాన్ని ఆదా చేయాలని సీఎం సూచించారు. ఈ మేరకు మంత్రులు కూడా తమ కాన్వాయ్‌లోని వాహనాలను తగ్గించుకున్నారు.

## ఆర్డీటీ సంస్థకు అండగా మంత్రి లోకేష్

- ఆర్డీటీ సంస్థకు నా వంతు సహాయం చేయగలగడం అదృష్టంగా భావిస్తున్నా
- ఆర్డీటీ అనేది మనందరి సంస్థ
- ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి ప్రజలందరూ మద్దతుగా నిలవాలి
- ఆర్డీటీ సేవలు ఆంధ్ర రాష్ట్రం మొత్తం విస్తరించాలి, మేం అండగా నిలబడతాం
- బత్తలపల్లిలో ఆర్డీటీ ఆసుపత్రి సందర్శన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్
- ఆర్డీటీకి అండగా నిలబడినందుకు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన మాంచో ఫెర్రర్

3 లో



## ప్రజల చెంతకు న్యాయ సేవలు

- మంజూరైన 96 కొత్త కోర్టులు త్వరగా పనిచేసేలా చూడండి
- జీపీ, ఏజీపీ ల ఖాళీల భర్తీ
- న్యాయ శాఖ సమీక్షలో మంత్రి ఎన్ఎండి ఫరూక్
- న్యాయ శాఖ అధికారులకు మంత్రి ఆదేశం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : న్యాయవ్యవస్థ సేవలను మరింత సునాయసంగా ప్రజలు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా చట్టాలపై, వాటిని వినియోగించడంపై ప్రజలలో చైతన్యం,

మిగతా 2లో...

### ● సీబీఎన్ బ్రాండ్‌తో..

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ!



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : సీబీఎన్ బ్రాండ్ ఇమేజ్ తో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వెల్లువెత్తుతున్నాయని పరిశ్రమలు మరియు వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖామాత్యులు టి.జి. భరత్ తెలిపారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి టిజీ భరత్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ప్రభుత్వం పెట్టుబడిదారుల ఆకర్షణలో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. పెట్టుబడుల రాకలో దేశంలో 25 శాతం కు పైగా మన రాష్ట్రానికి వస్తున్నాయని, ఇది హర్షనీయమైన విషయమన్నారు. అందుకు అనుగుణంగానే మంత్రివర్గం నిరంతరం పనిచేస్తుందన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు రావటంలో మరియు ఆ పరిశ్రమలు స్థాపన జరగటంలో ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతున్నామన్నారు. గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను తరిమికొట్టడంతో మొదట్లో కొంత ఇబ్బంది తలెత్తినా ముఖ్యమంత్రి దిశానిర్ధేశంలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

మిగతా 2లో...

## నా దేశం నా బాధ్యత

- నా దేశం నా బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- సీఎం మార్గనిర్దేశం లో పొదుపుచర్యలకు శ్రీకారం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు మోడల్ గా నిలవాలి.
- ప్రజాప్రతినిధులు, అధికారులు ఎనర్జీ పొదుపులో భాగంగా నేటి నుండే చర్యలు
- ఈవీ వాహనల వినియోగం, సోలార్ పవర్ ఎనర్జీపై అవగాహన పెంచుకోవాలి
- అవసరమైన విభాగాల్లో వర్క్ ఫ్రం హోం పై చర్యలపై సమాలోచన
- బంగారం కొనుగోళ్లుపై స్వీయ నియంత్రణ పాటించాలి
- దేశీయ టూరిజంకు పెద్దపీట వేయాలి.
- కొలుసు పార్థసారథి, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయం పొదుపు చర్యలను పాటించనున్నామని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాదేశం నా బాధ్యతలో

మిగతా 3లో...

## ఏపీ టూరిజానికి అంతర్జాతీయ గౌరవం



- 18 నెలల్లోనే రూ. 20,000 కోట్ల పెట్టుబడులు.. 100కు పైగా ఎంవోయూలు
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో అద్భుత ఫలితాలు
- డిజిటల్ విప్లవం, అంతర్జాతీయ బ్రాండింగ్‌తో ఇంటింటికీ చేరిన పర్యాటకం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ స్పృహ, మంత్రి కందుల దుర్గేష్ అంకితభావం.. ఈ ముగ్గురి సమిష్టి కృషి ఏపీ పర్యాటక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌పై సగర్వంగా నిలబెట్టింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం మరో అంతర్జాతీయ స్థాయి మైలురాయిని అధిగమించింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ వారు ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం)గా ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ - జీటీఎం టూరిజం అవార్డు 2026' స్వీకరించాల్సిందిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు నిర్వాహకులు అధికారిక ఆహ్వానం పంపారు. కేరళలోని తిరువనంతపురం, కోవలంలో ఉన్న 'ది లీలా' హోటల్‌లో జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న వేడుకలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ గురువారం వెలగపూడి సచివాలయం బ్లాక్ లోని తన ఛాంబర్ లో పర్యాటక శాఖ ఉన్నతాధికారులను అభినందించారు.

మిగతా 3లో...

# పేద విద్యార్థులకు వరంగా... మంత్రి లోకేష్ విజన్






**మంగళగిరి (జరలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరిస్తూ నిర్వహించిన కార్యక్రమం మంగళగిరిలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన 65 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే 100 శాతం ఫలితాలు సాధించిన 62 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**విజయానికి మూలం తల్లిదండ్రులు - గురువుల ఆశీర్వాదం:** కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నా కొద్దిమందికే అత్యుత్తమ మార్కులు రావడం వెనుక విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల అంకితభావం, భగవంతుడు ప్రసాదించిన మేధస్సు కారణమని అన్నారు. ప్రస్తుతం సాధించిన ఫలితాలు జీవితంలో మరింత ఉన్నత అవకాశాలకు పునాది వేస్తాయని పేర్కొన్నారు.

ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా వినయాన్ని కోల్పోకూడదని విద్యార్థులకు సూచించిన ఆయన, జీవితంలో పొందిన సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుని సమాజానికి తిరిగి సేవ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా కార్పొరేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని ఈ ఫలితాలు నిరూపించాయని పేర్కొన్నారు.

ప్రస్తుతం విద్యార్థులను సెల్‌ఫోన్లు, ఇతర ఆకర్షణల నుంచి దారి మళ్లించి చదువుపై దృష్టి పెట్టించడం చాలా కష్టమని, అలాంటి పరిస్థితుల్లో అద్భుత ఫలితాలు సాధించేలా మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయులు ప్రశంసనీయులని అన్నారు. పేదరికం ఎప్పటికీ అడ్డంకి కాదని, పరిమిత అవకాశాల మధ్య నుంచే గొప్ప విజయాలు సాధించవచ్చని చెప్పారు.

నరేంద్ర మోదీ, నారా చంద్రబాబు నాయుడు వంటి నాయకులు కూడా సాధారణ కుటుంబాల నుంచి వచ్చి ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, కష్టం, క్రమశిక్షణ, పట్టుదలతో సాధించిన విజయమే శాశ్వతమని పేర్కొన్నారు.

**ప్రభుత్వ బడుల్లోనూ ప్రతిభకు కొదవలేదు:** ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఈ విజయాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు కేంద్రాలుగా మారుతున్నాయని, ఇప్పటివరకు కార్పొరేట్ విద్యాసంస్థలవైపు మొగ్గుచూపిన వేలాది మంది తల్లిదండ్రుల దృష్టి ఇప్పుడు ప్రభుత్వ బడులవైపు మళ్లుతోందని అన్నారు. తాజా ఫలితాల ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహం కీలక పాత్ర పోషించాయని చెప్పారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యల వల్లే ప్రభుత్వ విద్యారంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

తనకు సొంతంగా స్కూల్స్, కాలేజీలు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ఎంతో తృప్తిని కలిగిస్తోందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. "విజయం అనేది ఒక్కరోజులో సాధించేది కాదు... నిరంతర కృషి, లక్ష్యసాధన పట్ల నిబద్ధతే విజయానికి మూలం" అని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అపార ప్రతిభ ఉందని, విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ఆయన స్పష్టం చేశారు.

**ప్రభుత్వ బడులు ప్రతిభకు కేంద్రాలు:** గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ నాణ్యమైన విద్యకు చిరునామాలుగా మారుతున్నాయని అన్నారు. గతంలో పేదలకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వ విద్యాసంస్థలు, ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లకు పోటీగా అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన ప్రణాళికాబద్ధమైన సంస్కరణల వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. పేరెంట్--టీచర్ సమావేశాలు, ఉపాధ్యాయ నియామకాలు, విద్యార్థుల ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దారితీశాయని తెలిపారు.

**పిల్లల ఆసక్తిని గౌరవించాలి:** మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న రంగంలోనే రాణించగలడని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలపై బలవంతంగా ఒత్తిడి తీసుకురాకూడదని సూచించారు. డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ వంటి సంప్రదాయ వృత్తులే కాకుండా ఫోటోగ్రఫీ, లా, డిజిటల్ మీడియా వంటి రంగాల్లో కూడా అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మార్పులు భవిష్యత్తులో కార్పొరేట్ విద్యాసంస్థలకు సవాల్‌గా మారతాయని అన్నారు. విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు దూరదృష్టితో కూడుకున్నవని అభిప్రాయపడ్డారు.

**మార్కుల కంటే వ్యక్తిత్వమే ముఖ్యం:** మాజీ ఎమ్మెల్సీ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో మార్కులు మాత్రమే ప్రామాణికం కాదని, వ్యక్తిత్వం ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలు, మార్కులతో దినపత్రికల్లో ప్రకటనలు రావడం ప్రభుత్వ విద్యా ప్రమాణాలు పెరిగిన సంకేతమని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని విద్యాపరంగా మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా మంత్రి నారా లోకేష్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఇలాంటి సన్మాన కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.

**సరైన నాయకత్వం ఉంటేనే ఫలితాలు:** గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ, ఒక వ్యవస్థ సమర్థంగా పనిచేయాలంటే దాన్ని నడిపించే నాయకత్వం బలంగా ఉండాలని అన్నారు. మంచి నాయకత్వం వల్లే ప్రభుత్వ విద్యారంగంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు.

ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూస్, మధ్యాహ్న భోజనం, "తల్లికి వందనం" వంటి పథకాలు అందిస్తూ తల్లిదండ్రుల బాధ్యతను పంచుకుంటోందన్నారు.

మార్పు వచ్చే వరకు ప్రజలకు దారి చూపి నడిపించే నాయకుడే నిజమైన మార్గదర్శి అని వ్యాఖ్యానించారు.

**విజన్ ఉన్న నాయకత్వం వల్లే మార్పు:** టీడీపీ జిల్లా కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, విజన్ ఉన్న నాయకుడు విద్యాశాఖను నడిపిస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో రానున్న రోజుల్లో మరింత స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు.

**టాప్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు:** కార్యక్రమంలో బాపట్ల జిల్లా కొల్లూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బవిరెడ్డి దివ్యతేజశ్రీ 596 మార్కులు, ఎన్టీఆర్ జిల్లా ఎస్‌టిబి హైస్కూల్ విద్యార్థిని అఖిల ఫర్వీన్ 595 మార్కులు, గుంటూరు జిల్లా తాడేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నేహాల్ జెట్‌వింగ్ 593 మార్కులతో విశేష ప్రతిభ కనబరిచారు.

టాప్ మెరిట్ సాధించిన 65 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేల నగదు ప్రోత్సాహకం, లెదర్ బ్యాగ్, పెన్, ప్రశంసాపత్రం అందజేశారు. 100 శాతం ఫలితాలు సాధించిన 62 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్జేడీ నాగమణి, డీఈవోలు సలీం బాషా, చంద్రకళ, రామారావు, సుధాకర్‌రావు, శాంతకుమారి, యేసురత్నం, పిడికిటి తిలక్‌బాబు, తిరుమలేష్ తదితర విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఖనిజాలకు 'విలువ' జోడింపు!

(మొదటి పేజీ తరువాయి)

2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖల అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సొంత ఆదాయాలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,04,345 కోట్లుగా ఉంటే...2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,643 కోట్లుగా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ నుంచి రూ. 33,679 కోట్లు, గనులు శాఖ నుంచి రూ.10,300 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ.11,047 కోట్ల మేర ఆదాయం వచ్చినట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఓన్ రెవెన్యూలో 6 శాతం మేర వృద్ధి నమోదైనట్టు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,27,506 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని దానికి అనుగుణంగా పని చేస్తున్నామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గనులు, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి సద్వినియోగం కావాలి. పొరుగు రాష్ట్రాల ఆదాయాలను విశ్లేషించి మన రాష్ట్రంలోనూ సొంత ఆదాయం పెంపునకు కృషి చేయాలి. ప్రతీ ఆదాయార్జన శాఖ పూర్తి సామర్థ్యంతో పని చేయాలి. ఆదాయాన్ని కొల్పోయే పరిస్థితి ఎక్కడా ఉండకూడదు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. పెట్టుబడులు వస్తున్నప్పుడు టాక్స్ రెవెన్యూ పెరగాలి. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో లావాదేవీలు పెరుగుతున్నాయి. ఆదాయ లక్ష్యాలను చేరుకోవాలి. ఈవీ వాహనాల వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలి.



సంప్రదాయ వాహనాల స్థానే ఈవీలను ప్రోత్సహించాలి. రిజిస్ట్రేషన్ శాఖలో ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆదాయం పెరిగే మార్గాలను అన్వేషించాలి. 22ఏ లాంటి భూ వివాదాలు పరిష్కారం అయితే రిజిస్ట్రేషన్ ఆదాయాలు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో 42 రోజుల్లో 38 శాతం మేర ఆదాయంలో గ్రోత్ ఉంది. ఇది శుభపరిణామం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**గ్రోత్ సెంటర్లుగా జిల్లాలు... :** "పెట్టుబడులన్నీ సాకారమైతే ఆదాయాలు పెరుగుతాయి. కేంద్ర సహకారంతో పాటు సొంత ఆదాయాలను పెంచుకునేలా సామర్థ్యాలను పెంచుకోవాలి. ప్రస్తుత పెట్టుబడులకు అనుగుణంగా జీవీఏ, ఆదాయాలు పెరగాలి. ప్రాజెక్టులు గ్రౌండ్ అవుతున్నాయి. మొత్తంగా 30 శాతం ఆదాయం వృద్ధి నమోదు అయ్యే అవకాశం ఉంది. వ్యవస్థల్లో వినూత్నమైన విధానాలను అమలు చేయటం ద్వారా ఆదాయాలను పెంచుకోవచ్చు. జిల్లా యూనిట్ గా గ్రోత్ రేట్ లక్ష్యాలను సాధిస్తే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష్యాలను సులువుగా సాధించే అవకాశం ఉంటుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో లక్ష్యాలను మనం అంతా కలిసి సాధిద్దాం. పెట్టుబడులకు అనుగుణంగా జీఎస్టీ లక్ష్యాలను ఎలా చేరుకోగలమో విశ్లేషించాలి. లీకేజీలు అరికట్టటంలో ఏఐ టూల్స్ వినియోగించాలి. ఏఐ డ్రివెన్ జీఎస్టీ రిటర్న్ స్క్రూటినీ చేయాలి. పన్ను ఎగవేతలు లేకుండా పన్ను వసూళ్లు చేసేలా టెక్నాలజీ వినియోగించాలి. పన్ను చెల్లింపుదారులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించండి. వేధింపులు లేకుండా పన్ను వసూళ్లు జరగాలి. టెక్నాలజీ వినియోగం ద్వారా పన్ను ఎగవేతలు..నిబంధనల ఉల్లంఘనలను నివారించాలి. ప్రతీ ప్రభుత్వ శాఖ 360 డిగ్రీల్లో అంశాలను విశ్లేషించి ఆదాయ లక్ష్యాలను సాధించాలి. ఎక్సైజ్, గనులు, రవాణా శాఖలు ఏఐ టూల్స్ వినియోగించి ఎగవేతలను అరికట్టాలి. ఆదాయార్జన విషయంలో పూర్తి పారదర్శకంగా ఉండాల్సిందే. పొరుగు రాష్ట్రాల్లో వాహనాలు కొనుగోలు చేసి... ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.. ఇక్కడే వాహనాలు కొనుగోలు చేసేలా మోటివేట్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**అంతర్జాతీయ మార్కెట్‌కు ఎర్రచందనం ఉత్పత్తులు :** "ఎర్ర చందనం అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా వాల్యూ అడిషన్ చేసి ఉత్పత్తులను తయారు చేయండి. ప్రపంచంలోనే అరుదైన వనరు మనకు ఆదాయం తెచ్చిపెట్టాలి. ప్రొఫెషనల్ టాక్స్ ను వసూలు చేసే విషయంలో చట్టసవరణ అంశాన్ని పరిశీలించాలి. ఇక్కడ పనులు చేసుకుంటూ పొరుగు రాష్ట్రాలకు ఆదాయం పోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలి. యువతకు ఉపాధి, ఎంఎస్ఎంఈలు, ప్రొడెక్టు పర్ఫెక్షన్ వంటి అంశాలతో జీఎస్డీపీ, జీవీఏ సాధ్యం అవుతాయి. ఎకనమిక్ యాక్టివిటీ, జీవీఏ లక్ష్యాన్ని సాధించేలా ప్రతీ శాఖ సామర్థ్యం పెంచుకోవాలి. ఖనిజాల వాల్యూ అడిషన్ జరిగితే మరింత ఆదాయం సమకూర్చు కోగలుగుతాం. రేర్ ఎర్త్ మినరల్స్ ద్వారా గనుల ఆదాయం బాగా పెరిగేలా చూడాలి. ఏ శాఖలోనూ ఆదాయం తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. 24 గంటల్లో వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిపోవాలి. పురపాలక శాఖలో పన్నులు స్టాండడైజేషన్, రేషనలైజేషన్ కావాలి. పన్నుల్లో వ్యత్యాసాలను తగ్గిస్తే చెల్లించేందుకు ప్రజలు ముందుకు వస్తారు. జీఐఎస్, డ్రోన్ సర్వేలతో పాటు ఉపగ్రహ చిత్రాలను వినియోగించి అనుమతులు, నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. ప్రతీ నెలా మున్సిపాల్టీలు, కార్పోరేషన్ల పరిధిలోని ఆస్తులను గుర్తించి పన్ను అసెస్‌మెంట్లను నిర్ధారించాలి. పంచాయితీరాజ్ శాఖలో అన్నీ ఆన్ లైన్ వసూళ్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పథకాన్ని కూడా ఇంటిగ్రేట్ చేయండి. ఏపీలోని వివిధ పంచాయితీలకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వచ్చాయి. ప్రస్తుతం ఉన్న స్వచ్ఛాంధ్ర నిధులను త్వరితగతిన ఖర్చు చేస్తే..మరిన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అర్బన్, రూరల్ స్థానిక సంస్థల్లో నిధులు ఖర్చు చేసి స్వచ్ఛ భారత్ లక్ష్యాలను సాధించాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల అధికారులు హాజరయ్యారు.

## ప్రజల చెంతకు న్యాయ సేవలు



(మొదటి పేజీ తరువాయి)

అవగాహన కల్పించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అమరావతి వెలగపూడి సచివాలయంలోని న్యాయ, మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీలో న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, అధికారులతో మంత్రి ఫరూక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ న్యాయ సేవలను క్షేత్రస్థాయికి చేర్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలు,సదస్సులను విస్తృతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరం ఉన్న అర్హులందరికీ లీగల్ ఎయిడ్ సమకూర్చడానికి కృషి చేయాలని అన్నారు. సత్వర న్యాయం, పెండింగ్ కేసుల తగ్గింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 2026-27 లో 96 క్రొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటు ను కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇప్పటికే కొత్త కోర్టుల ప్రారంభోత్సవాలు జరిగాయని, వాటిని త్వరగా వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**జీపీ, ఏజీపీ ల ఖాళీలను భర్తీ చేయండి :** రాష్ట్రవ్యాప్తంగా వివిధ న్యాయ స్థానాల్లో ఖాళీగా ఉన్న జీపీ, ఏజీపీ ల పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని న్యాయశాఖ కార్యదర్శి, ముఖ్య అధికారులకు మంత్రి ఫరూక్ సూచించారు. జీపి, ఏజీపీల పని తీరును ప్రతి మూడు నెలలకు ఒక్కసారి సమీక్షించి ప్రభుత్వ ఇంట్రెస్ట్ ను కాపాడేలా, జాప్యం లేకుండా సత్వరంగా న్యాయం జరిగేందుకు కృషి చేసేలా చూడాలని అన్నారు. ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీని రూపొందించేందుకు జిఓఎం సమావేశాలు సకాలంలో నిర్వహించి జి ఓ ఎం సూచనల మేరకు త్వరగా రూపొందించాలని ఆదేశించారు. జ్యుడిషియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పథకం క్రింద ఎక్కువగా కేంద్ర నిధులు రాబట్టడానికి అన్ని చర్యలు చేపట్టి, కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు

# సీతాలం కొండేపాడు ఘటనపై మంత్రి నిమ్మల ఆరా



- **భాదితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : నిమ్మల రామానాయుడు ప శ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం సీతాలం కొండేపాడు గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

భాదితులు ఉపయోగించిన మైదా పిండి నాణ్యతపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఘటనకు గల కారణాలను సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించాలని సూచించారు.

ఇదిలా ఉండగా, భాదితులకు మెరుగైన వైద్యం అందించేందుకు సంబంధిత ఆస్పత్రుల యాజమాన్యాలతో కూడా మంత్రి నిమ్మల మాట్లాడారు. బాధితులు ఎక్కడ చికిత్స పొందుతున్నా, వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, బాధితులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చూడాలని మంత్రి సూచించారు.

# ఏపీలో మరో రెండు నగరాలు గ్రేటర్ సిటీగా మార్పు

- **138 పంచాయతీలు విలీనం, బిగ్ అప్డేట్**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రెండు నగరాలను 'గ్రేటర్' హోదాకు మార్చబోతోంది. విజయవాడ, తిరుపతి నగరాల గ్రేటర్ ప్రతిపాదనలకు సంబంధించి మరో అప్డేట్ వచ్చింది.

ఏపీ ప్రభుత్వం రెండు నగరాల విస్తీర్ణం పెంచేందుకు.. 10 మండలాల్లోని 138 గ్రామ పంచాయతీలను విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోకి మరో 64 పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో జనగణన పూర్తయ్యేలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ నగరాల ప్రతిపాదనలపై ఇప్పటికే నిర్ణయం తీసుకోవాల్సింది కానీ జనగణన కారణంగా పక్కన పెట్టారు.

విజయవాడ గ్రేటర్ సిటీ ప్రతిపాదనలో భాగంగా ఆ్న మండలాల్లో ఉన్న 75 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని 2014-2019 మధ్య ప్రతిపాదనలు వచ్చాయి. కానీ గత ఐదేళ్లు ఈ ప్రతిపాదనల్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనల్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటైతే కేంద్రం నుంచి నిధులు కూడా వస్తాయి.. అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.. అందుకే ఈ ప్రక్రియన వేగవంతం చేయనున్నారు. విజయవాడలోకి ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న ఎన్నో గ్రామాలు, పట్టణాలు కలిసిపోయాయి.. కానీ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల హోదాలోనే ఉన్నాయి. అందుకే అభివృద్ధికి అవకాశం లేకుండా పోయింది. అందుకే విలీన ప్రక్రియను పూర్తిచేసి విజయవాడను గ్రేటర్ కార్పొరేషన్‌గా మార్చాలని భావిస్తున్నారు.

తిరుపతిని గ్రేటర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు, గ్రామాల విలీనానికి సంబంధించి గతేడాది తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి మండలాల్లోని 64 గ్రామాలను గ్రేటర్ తిరుపతిలోకి విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మంగళం, అవిలాలలు తిరుపతి నగరంలో కలిసిపోయాయి.. అవి పంచాయతీలుగా ఉండటంతో అభివృద్ధి పనులు నిలిపోయాయి. ప్రతిపాదించిన గ్రామాలతో పాటుగా నగరంలో కలిసిన ప్రాంతాలతో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విలీన ప్రక్రియపై త్వరలోనే క్లారిటీ వస్తుంది అంటున్నారు.

గ్రేటర్ విశాఖపట్నంలోకి 64 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన గ్రామాల్లో 60శాతం నగరంలో కలిసిపోయాయి. అందుకే ఈ పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకుంటే మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా గ్రామాల విలీనం చాలా ముఖ్యమని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి, భీమిలి, గాజువాక మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖపట్నంలో విలీనమైన తర్వాతే అభివృద్ధి చెందాయని చెబుతున్నారు. మొత్తం మీద విజయవాడ, తిరుపతి గ్రేటర్ సిటీలుగా మారబోతున్నాయి.. విటు గ్రేటర్ విశాఖపట్నంలో మరికొన్ని గ్రామాలు విలీనంకానున్నాయి.

## సీబీఎన్ బ్రాండ్‌తో..
# ఏపీకి పెట్టుబడుల వెల్లువ!



(మొదటి పేజీ తరువాయి)

రిలయన్స్ కంపెనీ మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతో కష్టపడ్డామని తెలిపారు. ఈ రోజు కూడా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ. 3600 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామన్నారు. అయితే ఇది ఓర్వలేని ఒక పార్టీ నాయకులు జోకర్, స్టాండింగ్ కమెడియన్ ల వలే నిరాధార ఆరోపణలు చేస్తూ మా మైండ్ డైవర్ట్ చేయాలన్న కుయుక్తులు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కోర్టు లో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. మా కుటుంబం దశాబ్దాలుగా రాజకీయంలో ఉందని, ఏ రోజు కూడా ప్రత్యర్థులు సైతం మాపై అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడ్డారని అనలేదని, అటువంటి చరిత్ర మా కుటుంబానిది అని అన్నారు. ఎన్నికల సమయంలో సైతం ప్రత్యర్థులు తమపై ఇటువంటి ఆరోపణలు చేయలేదని గుర్తు చేశారు.

## ఏపీ టూరిజానికి అంతర్జాతీయ గౌరవం



(మొదటి పేజీ తరువాయి)

జూన్ 3 నుండి 5 వరకు జరిగే ఈ ఎక్స్‌పోలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు మరియు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇటువంటి వేదికపై ఆంధ్రప్రదేశ్‌కు అవార్డు దక్కడం రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి నిదర్శనం. మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ సాధించిన ఈ విజయ పరంపరపై శాఖాధికారులు మరియు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మంత్రి కందుల దుర్గేష్ కృషికి గుర్తింపు:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడంలో, రాష్ట్రసంస్కృతి, వారసత్వం, పర్యాటక ప్రాంతాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడంలో మంత్రి కందుల దుర్గేష్ కనబరిచిన దార్శనిక నాయకత్వం మరియు అంకితభావానికి ఈ అవార్డు దక్కింది. ప్రత్యేకించి పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచారు. రీజినల్ ఇన్వెస్టర్ల సదస్సులు, రోడ్ షోలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన వినిపించిన పర్యాటక వాణికి ఇన్వెస్టర్లు ఫిదా అయ్యారు. ఫలితంగా కేవలం 18 నెలల కాలంలోనే 100కు పైగా సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం విశేషం. ఈ క్రమంలో రాష్ట్రానికి ఏకంగా రూ. 20,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి అసాధారణ విజయాన్ని నమోదు చేశారు. అదే విధంగా పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట మరియు రాష్ట్ర పర్యాటక శాఖ బృందం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, గమ్యస్థానాల అభివృద్ధి మరియు పర్యాటక రంగానికి మంత్రి కందుల దుర్గేష్ ఇస్తున్న ప్రాధాన్యతను జీటీఎం మేనేజింగ్ ఎడిటర్ సిజి నాయర్ తన ఆహ్వాన పత్రికలో ప్రత్యేకంగా ప్రశంసించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పర్యాటక రంగాన్ని రాష్ట్ర ప్రగతికి చోదక శక్తిగా గుర్తించి చేపట్టిన విప్లవాత్మక మార్పులు నేడు జాతీయ స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయని మంత్రి దుర్గేష్ అన్నారు. పర్యాటక శాఖ చేపట్టిన వినూత్న ప్రచార కార్యక్రమాలకు ప్రశంసలతో పాటు ప్రతిష్టాత్మక అవార్డు వరించిందని పేర్కొన్నారు. సరికొత్త ప్రచార శైలి, సృజనాత్మక ఆలోచనలతో జాతీయ స్థాయి ప్రశంసలు అందుకోవడం ఏపీ పర్యాటక శాఖ సాధించిన అద్భుత విజయం. కేరళ వేదికగా దక్కబోయే అవార్డు ఆంధ్రప్రదేశ్ వైభవానికి మకుటాయమానం.""సముద్ర తీరాల సొగసు నుంచి ఆధ్యాత్మిక క్షేత్రాల వైభవం వరకు.. ప్రతి ప్రాంతాన్ని ఒక అంతర్జాతీయ పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతున్న కూటమి ప్రభుత్వ కృషి అజరామరమని హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... భవిష్యత్ అంతా టూరిజం దే అని విశ్వసించి, పర్యాటక రంగాన్ని 'మిషన్ మోడ్'లో అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో తెచ్చిన సంస్కరణలు ఈ విజయానికి పునాది వేశాయి. ముఖ్యంగా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, అత్యుత్తమ పర్యాటక పాలసీ 2024-29ని విడుదల చేయడం, హోమ్ స్టే, కారవాన్ టూరిజం, ల్యాండ్ అలాట్ మెంట్, బి అండ్ బీ వంటి అనుబంధ పాలసీలు, టెంట్ సిటీల ఏర్పాటు ఇవన్నీ ఒక చారిత్రక మైలురాయిగా చెప్పవచ్చు."పర్యాటకాన్ని కేవలం వినోదంగా చూడకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మార్చాలనే సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికత ఈ రంగానికి నూతనోత్తేజం ఇచ్చింది." దీనికి తోడు ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గారు పర్యాటక ప్రాంతాల పరిరక్షణ మరియు పర్యావరణ హిత పర్యాటకం పై చూపిన ప్రత్యేక శ్రద్ధ ఈ రంగానికి అదనపు బలాన్ని చేకూర్చింది. అంతేగాక గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం 8 పర్యాటక ప్రాజెక్టులకు దాదాపు రూ. 430 కోట్లు కేటాయించి ఏపీ పర్యాటకాభివృద్ధికి బాటలు వేయడం విశేషం. "కూటమి ప్రభుత్వ హయాంలో ఏపీ పర్యాటకం కేవలం విహారయాత్ర కాదు.. అది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి అసలైన గమ్యస్థానం. నాయకుల సంకల్పం – అధికారుల కార్యాచరణ వెరసి ఆంధ్రప్రదేశ్ నేడు ఇన్వెస్టర్ల స్వర్గధామంగా నిలుస్తోందనడంలో అతిశయోక్తి లేదన్నారు.

రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా రూపొందించిన సరికొత్త ఆవిష్కరణలు పరిశీలిస్తే... 1053 కి.మీ పొడవైన సుదీర్ఘ సముద్ర తీరాన్ని అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దడం.. తిరుమల, శ్రీశైలం, విజయవాడ, అరసవల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తులకు మెరుగైన దర్శనం, వసతి సౌకర్యాలు కల్పించడం.. అరకు లోయ, గండికోట, లంబసింగి, సూర్యలంక బీచ్ వంటి ప్రాంతాల్లో సాహస క్రీడలు, కారవాన్ టూరిజం ప్రవేశపెట్టడం... కొండపల్లి టాయ్ ఫెస్టివల్ వంటి స్థానిక కళలను, లేపాక్షి వంటి చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం.. టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, కల్చర్, బీచ్, రివర్, వెల్ నెస్, క్రూయిజ్ తదితర విభిన్న టూరిజం ప్రక్రియలను పరిచయం చేయడం, ప్రత్యేకించి సోషల్ మీడియా మరియు అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని 'బ్రాండ్ ఏపీ'గా ప్రదర్శించి పర్యాటకులను ఆకర్షించడం, ఏడాది పొడవునా పర్యాటక శోభ ఉండేలా విశాఖ, అనకాపల్లి, అరకు ఉత్సవ్, గండికోట ఉత్సవ్, ఫ్లెమింగో ఫెస్టివల్, అమరావతి అవకాయ్ ఫెస్టివల్, ఆత్రేయపురం బోట్ ఫెస్టివల్, విజయవాడ, కొండవీడు ఉత్సవ్ తదితర పర్యాటక పండుగలతో విస్తృత ప్రచారం కల్పించడం ఈ అవార్డు వరించడానికి కారణాలయ్యాయని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట మరియు టూరిజం అధికారుల బృందం సమన్వయంతో డిజిటల్ మార్కెటింగ్ చేపట్టడం వల్ల యాత్రికులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ చర్యల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కేరళలో అందుకోబోయే ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవానికి కేవలం ఆరంభం మాత్రమేనని పర్యాటక శాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## కిడ్నీ, లివర్, హార్ట్ బాధితులకు 895 కొత్త పెన్షన్లు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం క్రింద తీవ్రమైన కిడ్నీ సమస్యలతో డయాలసిస్ చేయించుకుంటోన్న బాధితులు, కిడ్నీ, కాలేయ, గుండె మార్పిడి చేయించుకున్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా 895 కొత్త పెన్షన్లు మంజూరైనట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. పైన పేర్కొన్న వారితో పాటు ద్వైపాక్షిక బోదకాలు, కుష్టుతో పాటు ధీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతోన్న అర్హులైన పేదలు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ 895 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని మంత్రి తెలిపారు. ఈ పెన్షన్లతో నెలకు ప్రభుత్వంపై రు. 86,34,000 అదనపు భారం పడుతుందన్నారు. వీరికి ప్రతి నెలా 1వ తేదీనే స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది వారి ఇళ్లకే వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేస్తారని మంత్రి తెలిపారు.

# దేశానికి రక్షణ కవచంలా రాయలసీమ ప్రాజెక్టులు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. రక్షణ సీమ... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టికల్చర్, స్పేస్, డ్రోన్, సోలార్, విండ్ ఎనర్జీ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న రాయలసీమ డెవలప్మెంట్ జర్నీలో మరో కీలక రంగం జత కానుంది. ఇకపై రాయలసీమ దేశ రక్షణ రంగంలోనూ తన ముద్రను వేయబోతోంది. ప్రత్యేకతను చాటుకోనుంది. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టును ఏరో నాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ-డీఆర్డీఓ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. రూ.15,803 కోట్లతో, 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇది భారతదేశపు మొట్టమొదటి 5th Generation స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి హంగులతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేయడంతోపాటు... టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. అలాగే ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఇతర యూనిట్ల ద్వారా రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 400 ఎకరాలు కేటాయించింది. వీటితో పాటు కర్నూలు జిల్లాలో నిర్మిస్తోన్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈవీజాూ ప్రాజెక్టుతో పాటు డిఫెన్స్ రంగానికి చెందిన 4 ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా రూ.4145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వీటిల్లో మడకశిరలో రెండు ప్రాజెక్టులు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు జిల్లాలోని డ్రోన్ సిటీలో నిర్మాణాలు చేపట్టనున్నాయి.

**మరో 12 ప్రాజెక్టులకు శంకుస్థాపన...:**

డిఫెన్స్ ప్రాజెక్టులు

కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ – రూ. 1430 కోట్ల పెట్టుబడి -- 565 మందికి ఉపాధి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ – రూ. 489 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి

హెచ్ఎఫ్‌సీఎల్ రూ. 1040 కోట్ల పెట్టుబడి – 870 మందికి ఉపాధి

ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ – రూ. 500 కోట్ల పెట్టుబడి – 2050 మందికి ఉపాధి

**డ్రోన్ ప్రాజెక్టులు :** అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 34 కోట్ల పెట్టుబడి – 52 మందికి ఉపాధి

డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 255 కోట్ల పెట్టుబడి – 850 మందికి ఉపాధి

డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ – రూ. 5 కోట్ల పెట్టుబడి – 14 మందికి ఉపాధి

హెచ్ సి రోబోటిక్స్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి

సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్ – రూ. 68 కోట్ల పెట్టుబడి – 45 మందికి ఉపాధి

ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 150 మందికి ఉపాధి

జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్ – రూ. 114 కోట్ల పెట్టుబడి – 350 మందికి ఉపాధి

లాట్రిక్ ఎయిరో స్పేస్ – రూ. 10 కోట్ల పెట్టుబడి – 125 మందికి ఉపాధి

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్... :** ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉదయం 08:15 గంటలకు ఉండవల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 09:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10:15 గంటలకు శంకుస్థాపన కార్యక్రమ వేదిక వద్దకు చేరుకుంటారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఈవీజాూ ప్రాజెక్టుకు శంకుస్థాపనతో పాటు వివిధ డిఫెన్స్, డ్రోన్ ప్రాజెక్టులకు భూమి పూజను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం చంద్రబాబు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 02:20 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు.

# ఆర్డీటీ సంస్థకు అండగా మంత్రి లోకేష్




**బత్తలపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్డీటీ సంస్థకు నా వంతు సహాయం చేయగలగడం అదృష్టంగా భావిస్తున్నా. ఆర్డీటీ అనేది మనందరి సంస్థ. ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి ప్రజలందరూ మద్దతుగా నిలవాలి. ఆర్డీటీ సేవలు ఆంధ్ర రాష్టం మొత్తం విస్తరించాలని, తాము అండగా నిలబడతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లిలో ఆర్డీటీ(రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్) ఆసుపత్రి సందర్శన అనంతరం అక్కడ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. నా పాదయాత్రకు ముందు ఆర్డీటీ గురించి విన్నాను. కానీ పాదయాత్రలో ఆర్డీటీ చేస్తున్న అద్భుతమైన కార్యక్రమాలు కళ్లారా చూశా. ఇంట్లో వికలాంగులుగా పిల్లలు పుట్టినప్పుడు కొంతమంది తల్లిదండ్రులు.. బాధ, ఆవేదనతో వారిని వదిలేస్తారు. అలాంటి పిల్లలను సొంత బిడ్డల కంటే అద్భుతంగా చూసుకునే ఒక ఆర్డీటీ పాఠశాలకు వెళ్లా. అక్కడున్న ఉపాధ్యాయులు వారిని ప్రేమతో చూస్తున్నారు. అనంతపురంలో యువగళం పాదయాత్ర సమయంలో మొదటిసారి మాంచో ఫెర్రర్ గారిని కలవడం జరిగింది. ఆర్డీటీ ఒక సంస్థ మాత్రమే కాదు.. అదో మూవ్ మెంట్. ఆర్డీటీని ఇక్కడ స్థాపించి 57 ఏళ్లు పూర్తయ్యాయి. ఓ వైపు పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడలు, నిరుపేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం వంటి అద్భుతమైన సేవా కార్యక్రమాలు ఆ కుటుంబ చేస్తోంది. నన్నే కదిలించారు. పాదయాత్ర ఇతర జిల్లాలకు వెళ్లినా నా స్పీచ్ లో అనేకసార్లు ఆర్డీటీ సంస్థ గురించి మాట్లాడటం జరిగింది.

**ఆర్డీటీకి అండగా నిలబడతాం :** నేను బలంగా నమ్మేది సమాజానికి అద్భుతమైన సేవ చేస్తున్న ఏ వ్యక్తికైనా సమాజం, ప్రభుత్వం అండగా నిలబడాల్సిన బాధ్యత ఉంది. గతంలో ఆర్డీటీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది. ప్రత్యేకంగా మాంచో గారితో నేను పర్సనల్ గా ఫాలోఅప్ చేసుకుని కొన్ని అపోహలు ఉంటే వాటిని తొలగించి, వారికి రావాల్సిన లైసెన్స్ ఎన్డీయే ప్రభుత్వం అందించడం జరిగింది. ఆర్డీటీ అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తోంది కాబట్టే మేం పట్టుదలతో చేశాం. వెనుకబడిన జిల్లాను దత్తత తీసుకుని, ఇక్కడ ప్రజలను ప్రేమతో సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తున్నారు. అందుకే ఈ వ్యవస్థకు అండగా నిలబడ్డాం. మున్ముందు కూడా నిలబడతాం. ఈ రోజు మాంచో గారి మాతృమూర్తిని కూడా కలవడం జరిగింది. మొదటిసారి మాంచో గారిని కలిసినప్పుడు ఆయన మాట్లాడే తెలుగును చూసి నేనే ఆశ్చర్యపోయా. తాను పుట్టి పెరిగింది ఇక్కడే అని ఆయన చెప్పారు. 13 ఏళ్ల వయసు వచ్చే వం-కు తనకు ఇంగ్లీష్ తెలియదని చెప్పారు.

**ఆర్డీటీ సంస్థకు నా వంతు సహాయం చేయగలగడం అదృష్టంగా భావిస్తున్నాలి :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకునేందుకే నేను పాదయాత్ర చేశా. ఇలాంటి అద్భుతమైన సంస్థలను నేరుగా కలవాలి. వారు చేస్తున్న పవిత్రమైన కార్యక్రమాలు మేం తెలుసుకోవాలి. జీవితాంతం ఇలాంటి అద్భుతమైన సంస్థలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో ఆనాడు పాదయాత్ర ప్రారంభించాం. ఆర్డీటీ సంస్థకు నా వంతు 0.001 శాతం సహాయం చేయగలగడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఒక భారతీయుడిగా, తెలుగువాడిగా, ఆంధ్రుడిగా ఆర్డీటీ అనేది మనందరి సంస్థ. ప్రాంతాలకు, రాజకీయాలకు అ-తీతంగా ఈ సంస్థకు ప్రజలందరూ, సమాజం మొత్తం మద్దతుగా నిలవాలని నేను పిలుపునిస్తున్నా. నేనిప్పుడే పీడియాట్రిక్ వార్డుకు వెళ్లా. ఒక తండ్రి వారి పాపను చూపించారు. పాప ఈ ఆసుపత్రిలోనే జన్మించిందని, హార్ట్ ప్రాబ్లమ్ ఉందంటే వేరే ఆసుపత్రిలో రూ. 3 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారని, ఆర్డీటీ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారని వివరించారు. అదీ ఆర్డీటీ చేసిన సేవ అని ఆయన చెప్పారు. అది విన్న తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగింది. మేం మరింత సేవ చేయాలి. నా వంతు నేను సహాయం చేయాలనే ఆలోచనతో మీ ముందు నిలబడ్డా.

**ఆర్డీటీ సేవలు ఆంధ్ర రాష్టం మొత్తం విస్తరించాలి, మేం అండగా నిలబడతాం :** మాంచో గారికి ధన్యవాదాలు. కష్టకాలంలో కూడా ఓర్పు, సహనంతో ప్రజలకు ఎప్పుడూ సేవ అందిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి కూడా ఇది నా బాధ్యత అని అన్నారు. అనంతపురం, ఆంధ్ర ప్రజలే కాదు.. తెలుగుజాతి మొత్తం ఆర్డీటీకి అండగా నిలబడాలి. కేవలం రాయలసీమలోనే కాదు.. మీ సేవలు ఆంధ్ర రాష్ట్రానికి చాలా అవసరం.. ఇంకా సేవలు అందించండి.. మీకు మేం అండగా నిలబడతాం అని మాంచో గారిని కోరుతున్నా. భారతదేశం మొత్తం ఆర్డీటీకి అండగా నిలబడుతుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

**ఆర్డీటీకి అండగా నిలబడినందుకు కృతజ్ఞతలు: మాంచో ఫెర్రర్ :** ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ.. మొట్టమొదట లోకేష్ గారికి నా అభినందనలు. మొదటిసారి ఆర్డీటీ ఆసుపత్రికి వచ్చారు. లోకేష్ గారిని చూసి ఇక్కడున్న పేషంట్స్, సిబ్బంది చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఏడాది పాటు ఎన్నో కష్టాల్లో ఉన్నప్పుడు లోకేష్ గారు చాలా సహకరించారు. మొదట కలిసినప్పటి నుంచి ఆర్డీటీకి ఎంతో సహకరించారు. లోకేష్ గారికి, మీ అందరికీ నా కృతజ్ఞతలు.

# నా దేశం.. నా బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



భాగంగా ప్రతి ఒక్కరూ పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు చర్యలపై దిశానిర్దశం చేశారన్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వాహణ శ్రేణిలో వాహనాల సంఖ్యను స్వచ్ఛందంగా తగ్గించడం, సమావేశాలను ఆన్ లైన్ లో వర్చువల్ గా నిర్వహించడం, వారానికి ఒక సారి నో వెహికల్ ఫ్రైడే పాటించడం తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు సైతం స్వచ్ఛందంగా పొదుపు చర్యలు తీసుకోవాలని కోరారు.

యుద్ధ వాతావరణ నేపథ్యంలో ఇందన అవసరాల తగ్గింపు, విదేశీ మారక నిల్వల పరిరక్షణ, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, అలాగే ఆయిల్, గ్యాస్, యూరియా తదితర దిగుమతుల తగ్గింపు తో నియంత్రణ పాటించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. అరటి, ధాన్యం, వ్యవసాయ, ఉద్యానవన పంటల ఎగుమతులపై యుద్ధ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకనే ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, తాము పొదుపు చర్యలు పాటిస్తూ వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మనందరం ఒక్క మాటపై నిలబడి కష్టాల నుండి బయటపడాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి శాఖలోనూ గతంలో వాహనాలకు వినియోగించే ఆయిల్ పరిమితిని సాధ్యమైనంత తక్కువ ఉండేలా చూడటం, ప్రభుత్వం నూతన వాహనాలను కొనుగోలు చేయాలంటే ఈవీ వాహనాలనే కొనుగోలు చేయడం వంటి చర్యలతో పాటు ప్రజలను చైతన్య పరిచేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ప్రజలు వాకింగ్, సైక్లింగ్ తదితర పర్యావరణ హితమైన చర్యలు పాటించాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యటనల సమయంలో దగ్గర దూరాన్ని పాదయాత్రగా చేయాలని సూచించారు. వారానికి ఒక రోజు మంత్రులు, అధికారులు సైకిళ్లపై ఏపీ సచివాలయానికి వస్తే ఖచ్చితంగా అది ప్రజలపై ప్రభావం చూపి వారు సైతం అదే బాట పడతారన్నారు.

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో వారానికి రెండు రోజులు నో వెహికల్ డే లుగా పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఈవీ స్టేషన్ ల పెంపు లో భాగంగా ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ట్రాఫిక్ లో సైతం ఎక్కువ సేపు వాహనాలు నిలవకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్టీసీ సంస్థ తీసుకుంటున్న పొదుపు చర్యలపై సమీక్షిస్తామన్నారు. కేంద్రం రాష్ట్రానికి అందించనున్న ఈవీ బస్సులు త్వరగా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెద్ద పెద్ద విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు కూడా పొదుపులో భాగంగా ఆన్ లైన్ క్లాస్ ల నిర్వహణపై సమాలోచన చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన విభాగాల్లో వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ నిర్వహణపై పరిశీలన చేస్తున్నామన్నారు.

స్వదేశీ టూరిజం, స్వదేశీ ప్రొడక్ట్స్ పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, విదేశీ ప్రయాణాలు తగ్గించుకుని వేసవితో పాటు ఇతర సెలవు రోజుల్లో దేశంలోని ఆయా ప్రాంతాలకు వెళ్లాలని, అలాగే విదేశీ వస్తువుల కొనుగోళ్లను తగ్గించి స్వదేశీ తయారీ ఉత్పత్తులను ఎక్కువగా వాడాలని మంత్రి పార్థసారథి కోరారు. బంగారం కొనుగోళ్లపై నియంత్రణ పాటించాలని, మన దేశంలో వందల టన్నుల్లో బంగారం దిగుమతి చేసుకుంటున్నామని దీంతో విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయని, కావున ప్రజలు స్వచ్ఛందంగా బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్నారు. బంగారంపై మోజు తగ్గించుకుని కొద్ది రోజులు ఆగుదాం అని వేచి చూడటం వల్ల మన దేశం బంగారం దిగుమతులు తగ్గిస్తుందని వివరించారు. ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ను బిగించుకోవాలని మంత్రి పార్థసారథి సూచించారు. సోలార్ ప్యానెల్స్ బిగింపు కార్యక్రమంను వేగంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రైతులు కూడా ఎరువుల వాడకం తగ్గించాలని, నానో ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## యువత కోసం 'యాక్టివ్ యువ' ఆరోగ్య బీమా పథకం

ADITYA BIRLA CAPITAL HEALTH INSURANCE

- **ఆరోగ్యకర జీవనశైలికి 'హెల్త్‌రిటర్న్స్' ద్వారా ప్రత్యేక ప్రోత్సాహకాలు**
- **ఓపిడి, వెల్నెస్, ఆదాయ రక్షణ ప్రయోజనాలతో సమగ్ర బీమా సదుపాయాలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ యువ భారతదేశం కోసం ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో 'యాక్టివ్ యువ' పేరుతో కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభించింది. యువతలో మారుతున్న జీవనశైలి, ఫిట్‌నెస్ మరియు వెల్నెస్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది.

ఈ పథకంలో భాగంగా సంస్థ తన 'హెల్త్‌రిటర్న్స్' మోడల్‌ను మరింత విస్తరించింది. రోజుకు 10 వేల అడుగులు నడవడం లేదా ఒక వ్యాయామ సెషన్‌లో 300 కేలరీలు ఖర్చు చేయడం వంటి ఆరోగ్యకర అలవాట్లకు వినియోగదారులకు ప్రోత్సాహకాలు అందించనుంది. స్థిరమైన శారీరక శ్రమతో పాటు మంచి హెల్తీ హార్ట్ స్కోర్ కలిగిన పాలసీదారులు వార్షిక ప్రీమియంలో 100 శాతం వరకు తిరిగి పొందే అవకాశం కల్పించింది.

'యాక్టివ్ యువ' పథకం 'ఈట్, మూవ్ అండ్ హీల్' అనే మూడు ప్రధాన అంశాలపై రూపొందించబడింది. యాప్‌లో నెలలో 21 రోజుల పాటు రోజుకు రెండు పూటల భోజన వివరాలను నమోదు చేసే వినియోగదారులకు నెలవారీ హెల్త్‌రిటర్న్స్‌లో 10 శాతం అదనపు లాభం లభిస్తుంది. అలాగే నెలకు సగటున 7,500 అడుగులకు పైగా నడిచే లేదా ఒక్క సెషన్‌లో 250 కేలరీలు ఖర్చు చేసే వారికి ప్రతి నెలా నాలుగు బోనస్ యాక్టివ్ డేస్ ఇవ్వనున్నారు. నెలలో 21 రోజుల పాటు 7 నుంచి 8 గంటల నిద్రను పాటించే వారికి హెల్త్‌రిటర్న్స్‌లో 15 శాతం వరకు అదనపు ప్రయోజనం అందించనున్నారు.

ఈ సందర్భంగా మయాంక్ బతత్వాల్ మాట్లాడుతూ, "మారుతున్న జీవనశైలి, ఆరోగ్య అలవాట్లకు అనుగుణంగా ఆరోగ్య బీమా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నేటి యువత తమ ఆరోగ్యంపై చురుకుగా దృష్టి సారిస్తోంది. అలాంటి వినియోగదారులకు అనుగుణంగా బీమాను మరింత ప్రయోజనకరంగా మార్చేందుకు 'యాక్టివ్ యువ'ను తీసుకొచ్చాం" అని తెలిపారు.

బీమాను కేవలం అత్యవసర వైద్య ఖర్చులకే పరిమితం చేయకుండా, రోజువారీ ఆరోగ్యకర జీవన విధానంలో భాగస్వామ్యంగా మార్చడమే ఈ పథకం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## సిలిండర్ల డోర్ డెలివరీ పెంచాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ సంఖ్య పెంచాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జిల్లాలో నిత్యవసర వస్తువుల ధరలపైన, ఎల్.పి.జి, రేషన్ పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అయిల్ కంపెనీలు అదనపు సంఖ్యలో సిలిండర్లు సరఫరా చేయాలని, ఏజెన్సీలు రోజువారీ డెలివరీ సంఖ్యను ఎక్కువగా పెంచాలని అన్నారు. జిల్లాకు ఎక్కువగా సిలిండర్లు కేటాయించినందువలన గత రెండు నెలలుగా రోజువారి ఎక్కువగా పంపిణీ చేయుట వలన జిల్లాల్లో పెండెన్సీని తగ్గించడం జరిగిందని చెప్పారు. అందరి సహకారంతో వినియోగదారులకు సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది కలగకుండా చేయుటకు కృషి చేయాలని కోరారు. ఎటువంటి అవకతవకలు పాల్పడకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. నిత్యావసరులకు సరుకులకు సంబంధించి గడిచిన మూడు నెలల ధరలు, ధరలలో వచ్చిన మార్పునకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. గత మూడు నెలలతో పోల్చి చూడగా ప్రస్తుతము వంటనూనెల ధరలలో పది రూపాయలు తగ్గుదల కనిపించిందన్నారు. మిగిలిన నిత్యావసర వస్తువుల ధరలన్ని నిలకడగానే ఉన్నాయని చెప్పారు. వంటనూనెల ప్యాకెట్టు విషయమై వినియోగదారుల అవగాహన నిమిత్తం, ప్రతి దుకాణదారుడు ధరల పట్టికలో ప్యాకెట్టు బరువును ఖచ్చితముగా ప్రదర్శించాలని ఆదేశించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ పంపిణీ పై ఐ వి ఆర్ ఎస్ సర్వేలో గుంటూరు జిల్లా మంచి స్థానంలో ఉందన్నారు. కొంతమంది డీలర్లు ఇంకా మెరుపు పడాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. కార్డుదారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వారు పనితీరును మెరుగుపరుచుకొనుటలో అలసత్వము వహించరాదని స్పష్టం చేశారు. డీలర్లు కార్డుదారులకు సక్రమముగా రేషన్ పంపిణీ చేయాలని, మర్యాద పూర్వకముగా ప్రవర్తించాలని ఆదేశించారు. జిల్లాల్లో ఇంకా 20,900 మంది వఎెఎెప్రక్రియ జరగలేదని త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయుటకు అవగాహన కల్పించాలని అన్నారు. డీలర్లు రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని, ఏమైనా అక్రమ వ్యాపారము చేస్తున్నట్లు గుర్తిస్తే తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, మార్కెటింగ్ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్, పప్పుల, వంటనూనెలు, బియ్యం వ్యాపారస్తుల ఆసోసియేషన్స్, రైతు సంఘాలు పాల్గొన్నారు.

## గుమ్మడిదలలో రెడ్డి చికెన్ సెంటర్ ప్రారంభోత్సవం




**-వ్యాపార రంగంలో యువత ముందడుగు వేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.**

**(జర్నలిస్ట్ ఫైల్)**గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో యువకుడు పోచుగారి సాయికిరణ్ రెడ్డి ఏర్పాటు చేసిన రెడ్డి చికెన్ సెంటర్ ను మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్‌తో కలిసి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి అనంతారం సర్పంచ్ కొమ్ము శ్రీను,ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, సదానంద రెడ్డి,బాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

## పరీక్షల ఒత్తిడితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**సైబరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):**పరీక్షల మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ ఇంటర్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన సైబరాబాద్ కమిషనరేట్ లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన మద్దెపు పూజారెడ్డి (16) పర్వత్‌నగర్ ఎక్స్‌రోడ్స్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ బెటర్మెంట్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న ఆమె, తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై మంగళవారం రాత్రి గదిలో ఎవరూ లేని వేళ చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి గోపిరెడ్డి బుధవారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

## కనిపించకుండా పోయిన బాబును సురక్షితంగా తల్లి ఒడికి చేర్చిన జర్నలిస్టులు





**ఎర్రగుంట్ల :** కడప జిల్లా ఎర్రగుంట్ల కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామం ఉండే ప్యాపిలి లక్ష్మీదేవి కుమారుడు శివ ప్రసాద్ రెండు నెలల నుంచి కనిపించకుండా పోయిన బాలుడు నీ సోషల్ మీడియా ద్వారా ఎక్కడ ఉన్నాడు అని తెలుసుకున్న జర్నలిస్టులు కర్ణాటక బంగారుపేటలో రైల్వే స్టేషన్ పోలీసులు కే జి ఎఫ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీకీ కోలార్ గవర్నమెంట్ చిల్డ్రన్ హోమ్ కేర్ వారికి అప్పగించిన రైల్వే పోలీసులు అక్కడ నుంచి బాలుడిని సురక్షితంగా రక్షించి, తల్లికి అప్పగించి జర్నలిస్టులు ఆమె కళ్లలో ఆనందం నింపిన జర్నలిస్టు తప్పిపోయిన బాలుడిని క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన జర్నలిస్టులు ఇన్‌స్టాగ్రామ్ పోస్టిరి ద్వారా వాట్సాప్ గ్రూప్స్ ద్వారా ఫేస్బుక్ ద్వారా కొన్ని సమయాల్లో పోలీసుల ద్వారా లేద సామాజిక బాధ్యత కలిగిన జర్నలిస్టులు/వ్యక్తులు సకాలంలో స్పందించి బాబు నీ సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగిచ్చారు

## ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు



**రామ్ మందిర్ ఏరియా, మే 14 (జర్నలిస్ట్ ఫైల్):** రామగుండం నియోజకవర్గశాసనసభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం 46వ డివిజన్ ఇందిరానగర్‌లో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి – ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ పేరు మీద ఉన్న ఇందిరానగర్ నుంచే ఈ కార్యక్రమం ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. మహిళల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. "మీ చిరునవ్వు బాధ్యత మేము తీసుకుంటాము" అని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్స్యకారులకు చేపల పెంపకం సంక్షేమ పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వాలి...



**-మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్...**

**గుమ్మడిదల, మే 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మత్స్యకారులకు చేపల పెంపకం సంక్షేమ పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ కోరారు బుధవారం మున్సిపల్ పరిధిలోని గుమ్మడిదల మత్స్యకారుల సహకార సంఘం నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసి మత్స్యకారుల జీవనోపాధి కలిగించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కూడా మత్స్యకారుల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మత్స్యకారుల సంక్షేమ నిధి కేటాయించి రుణాలు ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలని అన్నారు. సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ వినయ్ కుమార్, మత్స్యశాఖ సంగం జిల్లా డైరెక్టర్ ఉప్పరి వెంకటేష్ ల సమక్షంలో గుమ్మడిదల నూతన మత్స్యశాఖ సహకార సంఘం నియామక పత్రాలను మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ కత్తుల రమేష్, ల సమక్షంలో అందజేశారు. మచ్చ సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..అధ్యక్షులు కుంటి పెంటయ్య, ఉపాధ్యక్షులు జిన్నా శంకర్, సెక్రెటరీ జిన్న కనకేష్, డైరెక్టర్స్, ఉషన్న రాజు, కాశబోయిన రాజు, కుంటి భాస్కర్, కోర్పాతి గణేష్, చిరుమని శ్రీనివాస్, జిన్న వెంకటేష్, ముదిరాజ్ సంఘం గ్రామ పెద్దలు కుంటి మల్లేష్, ఉషన్న లక్ష్మయ్య,ఆంజనేయులు, ప్యాట భాస్కర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు



**-:చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్షకు మద్దతు ఇవ్వాలి**

**-:డాక్టర్ భోగ శ్రావణి**

**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ బోగ శ్రావణి పిలుపునిచ్చారు. రాయికల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని ఎంపీ అరవింద్‌ను కోరగానే ఆయన వెంటనే చర్యలు తీసుకుని అనుమతి సాధించారని తెలిపారు. అయితే స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల రెండేళ్లుగా విద్యార్థులు నష్టపోతున్నారని, విద్యాభివృద్ధిలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ లోపు స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, లేకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్మదీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయనున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, రాయికల్ పట్టణం, మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మ మల్లారెడ్డి, మండల అధ్యక్షులు ఆకుల మహేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, మాజీ ప్యాక్స్ చైర్మన్ ముత్యం రెడ్డి, సామల్ల సతీష్, సుంటి గీకర్ రాము, వేముల రాము,తోపారపు సురేష్,బన్న సంజీవ్, కునారపు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్-2026 పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం




**-దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, మేధావులు**

**రామ్ మందిర్ ఏరియా, మే 14 (జర్నలిస్ట్ ఫైల్):** దేశవ్యాప్తంగా కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్-2026 పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ ఘటన అత్యంత దారుణమని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, తెలంగాణలోనే సుమారు 73 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష రద్దు కావడం కేవలం ఒక పరీక్ష వైఫల్యం మాత్రమే కాదని, దేశ పరీక్షా వ్యవస్థ మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయిందనే దానికి ఇది నిదర్శనమని అన్నారు. 'డిజిటల్ ఇండియా', 'పారదర్శక పాలన' అంటూ ప్రచారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షల భద్రతను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాజస్థాన్‌లోని సికర్ ప్రాంతం నుంచి పేపర్ లీక్ నెట్‌వర్క్ బయటపడినట్లు సమాచారం వచ్చిందని,వాట్సాప్,టెలిగ్రామ్‌ద్వారా ప్రశ్నాపత్రాలుప్రచారం అయ్యాయని, వాటిలోని అనేక ప్రశ్నలు అసలు పరీక్ష ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇప్పటికే కార్పొరేట్ విద్యా వ్యవస్థ, కోచింగ్ మాఫియా భారంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులపై ఇది మరో మోసపూరిత కుంభకోణమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే, డబ్బు, అవినీతి, రాజకీయ జోక్యంతో కొందరికి ముందుగానే ప్రశ్నాపత్రాలు చేరడం అత్యంత ప్రమాదకర పరిణామమని మండిపడ్డారు. ఇది కేవలం పేపర్ లీక్ మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే విద్యా వ్యాపార మాఫియా కుట్రలో భాగమని ఆరోపించారు. నీట్-2026 పేపర్ లీకేజీపై సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సమగ్ర సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లీకేజీకి పాల్పడిన మాఫియా, అధికారులు, మధ్యవర్తులు, సంబంధిత సంస్థలపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఎన్‌టీఏలో జరుగుతున్న అవినీతి, నిర్లక్ష్యం, ప్రైవేటీకరణ ధోరణులపై పూర్తిస్థాయి ప్రక్షాళన చేపట్టాలని కోరారు. విద్యార్థుల మానసిక వేదన, ఆర్థిక నష్టానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా బలమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కోచింగ్ కార్పొరేట్ మాఫియాపై కఠిన నియంత్రణలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం వెనుక ఎంత పెద్ద వ్యక్తుల హస్తం ఉన్నా వారందరినీ గుర్తించి కఠినంగా శిక్షించాలని, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.

## పౌర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: సీఎంసీ కమిషనర్ సృజన




**సైబరాబాద్, మే 14 :** సైబరాబాద్ నగరపాలకసంస్థ కార్యాలయంలో సీఎంసీ కమిషనర్ సృజన జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బుధవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో జరుగుతున్న పౌర పనులు, ఫిర్యాదుల పరిష్కార వేగం, ఇతర కీలక కార్యక్రమాల పురోగతిని సమీక్షించిన ఆమె, పనుల అమలులో జవాబుదారీతనం, సేవల నాణ్యత పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని, ఫిర్యాదులను కేవలం మూసివేయడమే కాకుండా పౌరులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో అసంబద్ధ చిత్రాలు, అస్పష్ట వ్యాఖ్యలు చేస్తే సహించబోమని, డేటా విశ్లేషణ ద్వారా సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు. ‹ప్రతిరోజు ఒక వార్డ్› కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను తదుపరి పర్యటన లోపు పరిష్కరించాలని, టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, ఆక్రమణల తొలగింపు వేగవంతం చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా జీవీపీ పాయింట్ల నిర్మూలన, "నో బిన్ – నో ట్రేడ?" నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, దోమల నివారణకు వార్డుల వారీగా ఫాగింగ్, స్ప్రేయింగ్ ముమ్మరం చేయడంతో పాటు పార్కులు, క్రీడా ప్రాంగణాల నిర్వహణ మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : మనాలి ఠాకూర్



**-కూలీల సమస్యలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ**

**రామ్ మందిర్ ఏరియా, మే 14 (జర్నలిస్ట్ ఫైల్):** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ బుధవారం పాలకుర్తి మండలంలో ఉపాధి హామీ కూలీలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా కూలీలకు అందాల్సిన సౌకర్యాలు, పనుల పరిస్థితులు, వేతనాల చెల్లింపులు తదితర అంశాలపై వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శ్రద్ధగావిన్నమనాలిఠాకూర్,వాటిని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నిరంతరం పనిచేస్తున్నారని, ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

## కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలి : ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



**రామ్ మందిర్ ఏరియా, మే 14 (జర్నలిస్ట్ ఫైల్):** కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ కోరారు. వార్డు సందర్శనలో భాగంగా నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి 51వ డివిజన్‌లోని అశోక్ నగర్, లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలువలపై అక్రమ నిర్మాణాలు ఉండడం వల్ల భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దుర్గంధం వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు, ఆటోలు సులభంగా రాకపోకలు సాగించేలా వీధులను విశాలంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం మానుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోసే వారిపై భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. పదేళ్లుగా కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత పది రోజులుగా కొనసాగుతున్న ఈ పనుల్లో పాలు పంచుకుంటున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, పారిశుధ్య సిబ్బందిని అభినందించారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సమర్థంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. లక్ష్మీ నగర్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో గణేష్ నగర్ వైపు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు. రామగుండాన్ని విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందిన అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నగరవాసి భాగస్వామి కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇళ్లను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటారో, నగరాన్ని కూడా అదే విధంగా శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం అశోక్ నగర్‌లో మురుగు నీటి కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు యంత్రాలతో ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు కొనసాగించాలని సూచించారు.

## *AMAR హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యేలు ముత్తుమూల మరియు దామ జనార్ధన్



**ఒంగోలు , మే 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని సౌత్ బైపాస్ జంక్షన్, ప్రగతి కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన »»AMAR హాస్పిటల్" ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో పాటు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు .ఒంగోలు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇలాంటి ఆధునిక వైద్య సదుపాయాలు మరింత అవసరమని, AMAR హాస్పిటల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం, స్థానిక నాయకులు, ప్రగతి కాలనీ నివాసితులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.


## తెలంగాణ అమరవీరుల పార్కును సందర్శించిన మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : బుధవారం ఉదయం నిజామాబాద్ పట్టణం లోని వినాయక్ నగర్ లో గల లితెలంగాణ అమర వీరుల పార్క్‌లి ను నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి రమేష్ సందర్శించి అమర వీరుల పార్క్ లో గల సమస్యలను వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తానని మేయర్ తెలిపారు.వాకర్స్ సభ్యులు ప్రధాన సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లి వివరించారు,అమర వీరుల స్థూపంలో వర్షాకాలంలో నీరు నిలిసి లీకేజీ అవుతుందని,వాకర్స్ కు టాయిలెట్ సౌకర్యం కల్పించాలని,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని,వర్ష కాలంలో నీరు నిలవకుండా డ్రైనేజ్ నిర్మించాలని,త్రాగునీటి వసతి కల్పించాలని,దోమలు రాకుండా ప్రతి రోజు ఫాగింగ్ చేయాలని,ఎక్సర్సైజ్ చేసే మిషన్ లను రిపేర్ చేయించాలని,ప్రతి రోజు చెత్త ను ఎత్తివేయాలని కోరారు.ప్రతి రోజు ఉదయం,సాయంత్రం సుమారు 500 మంది సీనియర్ సిటిజన్స్,పెద్దలు,మహిళలు,యువకులు,చిన్న పిల్లలు వస్తున్నారని తమరు అమర వీరుల పార్క్ పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని సమస్యలను పరిష్కరించాలని వాకర్స్ సభ్యులు వినోద్ కుమార్,ఆయుష్ పురుషోత్తం,రాజేందర్,రమేష్,దయానంద్,సాయగౌడ్,సంపత్,శ్రీనివాస్ గౌడ్,సామల ఒడ్డేన్న,చిన్నారెడ్డి,పెద్ద ఎత్తున వాకర్స్ పాల్గొన్నారు,పార్క్ కు మొదటిసారి వచ్చి సందర్శించినందుకు మేయర్ కు వాకర్స్ శాలువాతో సత్కరించారు.పార్క్ లో అందరికీ అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మేయర్ పార్క్ చుట్టూ తిరిగి మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి అన్ని వివరాలు తెలుసుకున్నారు.వాకర్స్ సభ్యులు పార్క్ ఎక్సర్సైజ్ మిషన్ లమెయింటెన్స్ ను మున్సిపల్ కార్పొరేషన్ అప్పచెప్పాలని కోరారు.

## బాల్య వివాహాల నిరోధానికి వినూత్న చర్య

**కళ్యాణ మండపంలో నే సర్టిఫికెట్ అందజేసిన సర్పంచ్ నవీన్.**



ఏన్కూరు, (జర్నలిస్ట్ ఫైల్) : ఏన్కూరు మండల పరిధిలోని రాజలింగాల గ్రామంలో బాల్య వివాహాలను అరికట్టే దిశగా గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివాహాలకు ముందుగానే వధూవరుల వివరాలు సేకరించి వయస్సు నిర్ధారించిన అనంతరం, చట్టబద్ధమైన వివాహాలకు బుధవారం కళ్యాణ మండపంలోని గ్రామ సర్పంచ్ ధనసరి నవీన్ మ్యారేజ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోగుల తిరపయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

## విద్యార్థులకు టైం సెన్స్ ఉండటం లేదు

ఖమ్మం,మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : కొందరు విద్యార్థులు ఉన్నత విద్యులకై పెట్టే ప్రవేశ పరీక్షలు మెడికల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ తో పాటు అనేక పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కాకపోవటం తో ఒక్క నిమిషమైనా ఆలస్యమైతే వారి పరీక్షకు అనుమతించరూ. కొందరు టైమ్ సైన్స్ పాటించబడినవల్ల అనేకమంది ఆలస్యంగా వచ్చి వెనుతిరిగిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గగ్గోలు పెట్టిన బతిమిలాడినా ఏడ్చిన ఫలితం ఉండదు. వారి వారి సెంటర్లో ముందుగానే తెలిసినప్పటికీ పరీక్షా కేంద్రానికి దూరమైనప్పుడు ఒకరోజు ముందే వెళ్లకుండా బస్సులను రైళ్లను ఆశ్రయించడం వల్ల కొందరు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. ప్రవేశ పరీక్షలలో సెల్ ఫోన్ తో పాటు నగలు ఇతరత్రా తేకూడదని నిబంధనలు ఉన్నా. పరీక్షా కేంద్రాలకు వచ్చిన తర్వాత కంగారు కంగారుగా తొలగించడం వల్ల పరీక్ష మీద కాన్సన్ట్రేషన్ పోయే ప్రమాదం ఉంది. కావున విద్యార్థులు సమయపాలన పాటించి పరీక్షకు హాజరైతే మంచిదే. కానీ లేట్ అయితే సంవత్సరం పాటు వృధా అవ్వవచ్చు.. కాంపిటేటివ్ పరీక్షలు అప్పుడు ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలి. బాధ్యతాయుతంతో పోతే భవిష్యత్తు అంధకారం అయ్యే ప్రమాదం. సమయపాల పాటించి ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులై బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాల్సిన అవసరం.

## శ్రీ వల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

**ఘనంగా నిర్వహించిన, రాపర్తి నరసింహారావు వెంకట్ లక్ష్మి పుణ్య దంపతులు**



ఖమ్మం, ఏదులాపురం, మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం రూరల్ ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల వరంగల్ క్రాస్ రోడ్ లోని, శ్రీ అభయ అంజయనేయ స్వామి ఆలయంలో శ్రీ వల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివిగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమంలో రాపర్తి నరసింహారావు-వెంకట్ లక్ష్మి, పుణ్య దంపతులు పాల్గొని, వేద పండితుల సమక్షంలో స్వామి వారికి మొదటగా గణపతి పూజ, నవగ్రహ పూజలు మరియు హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి వెంకట్ సాయి, రాపర్తి జననీ, కడియాల నాగులు, కడియాల భూలక్ష్మి, వేద పండితులు మారంరాజు ఫణి ప్రసాద్, మారంరాజు రమాదేవి, లక్ష్మణ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కేరెల్లి దేవాలయంపై ఉద్రిక్తతలు

**పూజా హక్కులు కల్పించాలని చాకలి నగేష్ మరియు కమిటీ విజ్ఞప్తి**



వికారాబాద్ మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : దారూర్ మండలం కీరెల్లి గ్రామంలో 1999 సంవత్సరంలో నిర్మించబడిన దేవాలయంపై ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దేవాలయానికి కుంచారం పెంటారెడ్డి స్థలం దానం చేయగా, అనంతరం కమిటి సహకారంతో దేవాలయం అభివృద్ధి చెందింది. గత కొన్ని సంవత్సరాలుగా చాగలి నగేష్ ఆధ్వర్యంలో కమిటీ దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి 2026 వరకు దేవాలయాన్ని పరిరక్షిస్తూ వచ్చారు.ఇప్పటివరకు గ్రామ ప్రజలు కలిసి దేవాలయంలో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే ఇటీవల కొందరు అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దేవాలయ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని చాకలి నగేశ్ మరియు ఎస్సీ వర్గాలకు చెందిన వారు దేవాలయంలో పూజలు చేయడం వల్ల ఆలయం అపవిత్రమైందని పేర్కొంటూ ప్రక్షాళన చేయాలని తీర్మానం చేసినట్లు సమాచారం.ప్రక్షాళన పేరుతో ప్రస్తుత దేవాలయాన్ని పూర్తిగా కూల్చివేసి కొత్త దేవాలయం నిర్మించే యత్నం జరుగుతోందని చాకలి నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయంలో పూజలు చేయడానికి తమకు హక్కులు ఇవ్వాలని కోరుతూ గతంలో తమపై పలుమార్లు దాడులు జరిగినట్లు ఆరోపించారు.



# ఎన్ టి ఆర్ తో పాటు ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు

**తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు- నిస్వార్థ నాయకుడు తుమ్మల ఆత్మీయ సభలో ఎంఎల్ఏ కూనంనేని**

ఖమ్మం,మే 14 (జర్నలిస్ట్ ఫైల్): నందమూరి తారక రామారావు



పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు లభించిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దయతో ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పని చేసినట్లు తనకు అవకాశం కల్పించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలకు ఈ సందర్భంగా పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో



బుధవారం ఆత్మీయ సభ నిర్వహించారు. తొలుత రాపర్తి నగర్ నుంచి ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపు మేరకు 1982లో రాజకీయాల్లోకి వచ్చినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1986 మే 14న మొదటిసారి నందమూరి తారక రామారావు మంత్రి వర్గంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్రావు, రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో తాను మంత్రిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసమే పని చేసినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో కూడా అక్కడి ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఊరికి నీటిని అందించినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల ఏర్పాటుతో పాటు ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు తెలిపారు. నాగార్జున సాగర్ కాలువపై పలు ప్రాంతాల్లో ఎత్తి పోతల పథకాలను ఏర్పాటు చేసి సాగునీటిని అందించామన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజల కోసమే తాను పనిచేశానన్నారు. అవినీతి లేని సుపరిపాలన అందించడమే తన లక్ష్యమన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్య శ్యామలం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. 40 ఏళ్ల పాటు తనను ఆదరిస్తూ, అభిమానిస్తున్న జిల్లా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



### మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల : ఎంఎల్ఏ కూనంనేని

తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకునిగా ప్రజలకు సేవలు అందించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుదని కొత్తగూడెం ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజాస్వామ్యంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవకుడిలా పని చేశారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తనకు 40 ఏళ్ల



అనుబంధం ఉందన్నారు. తాను మండల పరిషత్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మచ్చ లేని నాయకునిగా నిలిచారన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సేవ చేసే వారు కాకుండా వ్యాపారులు వస్తున్నారని ఇటువంటి తరుణంలో కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ



జీవితంలో 20 ఏళ్లు మంత్రిగా పనిచేసిన ఘనత తుమ్మల నాగేశ్వరరావుదన్నారు. కమ్యూనిస్టులతో టిడిపి పొత్తు ఉన్న సమయంలో కూడా కమ్యూనిస్టు నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి ఎటువంటి అరమరికలు లేకుండా పాలన సాగించారన్నారు. ముక్కుసూటి తత్వం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నైజం అన్నారు. ఏ అంశంపై న అయినా సుదీర్ఘంగా అసెంబ్లీలో మాట్లాడగలిగే వ్యక్తి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, మాజీ జెడ్పి ఛైర్మన్ గడిపల్లి కవిత, టీజీవో రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా



అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిత్రులు కందిమళ్ల కృష్ణారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## దమ్మాయిగూడెం లో పేరాల వారి పెళ్లిసందడి

**వధూవరులను ఆశీర్వదించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి**



తిరుమలాయపాలెం, మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామం లోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో పేరాల వెంకన్న - బుభమ్మ దంపతుల కుమారుడు మహేష్ బాబు, పూజితల వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. క్రైస్తవ సంప్రదాయం లో నిర్వహించిన ఈ పెళ్లిసందడికి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులు మహేష్ బాబు - పూజితలను ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని, వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భాషబోయిన వీరన్న, కార్యదర్శి దేవవరం దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరుల తల్లిదండ్రులు పేరాల వెంకన్న - బుభమ్మ దంపతులు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్పీఐ (ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీలు రద్దు

**రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అ ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్**




హైదరాబాద్, మే 14 : భారత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ -ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలను జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామని జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వర్ రావు గౌడ్ తెలిపారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం వచ్చే జూన్ మొదటి వారంలో సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో రాందాస్ అత్వాలే తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన నూతన కమిటీ ని ప్రకటిస్తారని తెలిపారు. వచ్చే జిహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్పీఐఅన్ని డివిజన్లలో పోటీ చేసి అధికంగా డివిజన్లను సాధించుకుంటుందని చెప్పారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకువస్తే పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రానికి చెందిన 8 మంది లోక్ సభ సభ్యులు వ్యతిరేకించడాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కమిటీలతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదు

**తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి**




హైదరాబాద్, మే 14 : కమిటీలతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి హెచ్చరించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను మరిచి చారిత్రక తప్పిదం చేసిందని ఆరోపించారు. ఆ తప్పులను సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మూట కట్టుకోవద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, రూ. 25వేల గౌరవ వేతనం ఇవ్వాలని, 100 ఎకరాల్లో అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వ పరంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యమ కారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 50 శాతం సబ్సిడీతో 1 కోటి రూపాయల రుణం వ్యాపార నిమిత్తం ఇవ్వాలని, రూ.25 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని అన్నారు. కేకే కమిటీని స్వాగతిస్తూ అందులో ముఖ్య సంఘాలకు చోటు ఇవ్వాలని కోరారు. జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వరకు ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదని అన్నారు. జేఏసీ ప్రధానకార్యదర్శులు గాజుల యాదగిరి, మోత్కూరి మల్లేష్, టి.శోభారాణి, రాపాక శ్రీశైలం, రహిమున్నీసా బేగం, కర్నె లక్ష్మీ, చిలుక శారద, జి. విజయ లక్ష్మీ, డి.వెంకట లక్ష్మీ, రాజు గౌడ్, వి.అరుణ, కె. లలిత, కె.సత్య, షాజహాన్, గందమాల యాదగిరి, లాలా దేవ, రాజ్ మహమ్మద్, ఎ. స్వప్న, మల్లారం పద్మ, కూరాకుల శ్యామల, ఎస్.రాజయ్య, బి.గోదావరి, సి. దేవానంద్, పి.నర్సయ్య, ఎల్.వనజలక్ష్మీ, టి.మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సుద్ధ వాగు తండాలో నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి



తిరుమలాయపాలెం మే 14 (జర్నలిస్ట్ ఫైల్) : మండల పరిధిలోని సుద్ధ వాగు తండా గ్రామం లో పలు వివాహ కార్యక్రమం లో పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వదించిన,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణం సమాచారం శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి జిల్లా నాయకులు రామ సహాయం అరవింద్ రెడ్డి ,ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్,ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ,ఆత్మ కమిటీ డైరెక్టర్లు ఓర వెంకటేశ్వర్లు, ఉప్పునూతల నాగేశ్వరరావు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్కూరి.శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, పుల్లూరి నాగరాజు, తవడబోయిన కృష్ణ, డీలర్ రవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అంటే ప్రజల హృదయ స్పందన : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

- గుంటూరును రోల్ మోడల్ గా మారుస్తాం
- 18 నెలల కాలంలో ఎన్నడూ లేని అభివృద్ధిని సాధించాం
- తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నాం
- ప్రతి కార్యకర్తకు టీడీపీలో గుర్తింపు
- గుంటూరు తూర్పు నియోజకవర్గ మహానాడులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** టీడీపీ కేవలం రాజకీయ పార్టీ కాదని ప్రతి వ్యక్తి హృదయ స్పందన అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకర్గానికి సంబంధించి మహానాడు కార్యక్రమం స్థానిక శ్రీ కన్వెన్షన్ లో వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 40-45 సంవత్సరాలుగా దేశంలో నిలకడగా కొనసాగుతున్న ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువస్తూ యువతకు అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు దేశంలో వస్తున్న పెట్టుబడుల్లో దాదాపు 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రావడం గర్వకారణమని అన్నారు. కార్యకర్తలు పదవులు, గుర్తింపు కోరుకోవడం సహజమని, అభివృద్ధి ప్రయోజనం ప్రతి కార్యకర్త కుటుంబానికీ చేరుతుందని తెలిపారు. కార్యకర్తలకు అవసరమైనప్పుడు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. గుంటూరులోనూ రాబోయే రోజుల్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని, గుంటూరును అమెరికాలోని ఒక ఆధునిక నగరంలా తీర్చిదిద్దాలనేదే లక్ష్యమని తెలిపారు.

**గుంటూరు తూర్పు రూపురేఖలు మార్చేశాం: ఎమ్మెల్యే నసీర్**

ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ తో సూపర్ హిట్ కొట్టాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ వంటి పథకాలు ప్రజల జీవన స్థితిగతులను మార్చే కార్యక్రమాలుగా నిలిచాయన్నారు. వందల కోట్ల రూపాయలతో వీధివీధికీ అభివృద్ధి తోరణాలు కట్టామని, మురుగుతో ముక్కుమూసుకునే కాలనీలను సైతం అద్దంలా మార్చామని తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నందివెలుగు బ్రిడ్జిని పూర్తి చేస్తున్నామని, పీపీపీ మోడ్ లో మానస సరోవరాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్న పరిస్థితుల్లో మొండిగేటు వద్ద వెంట్ విస్తీర్ణం పెంచేందుకురూ.8 కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. వంద కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు. పైపులైన్ల నిర్మాణం వంటి పనులు పూర్తి చేశామని, మరో రూ.80 కోట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. నియోజవర్గంలో ఇప్పటి వరకు రూ.11 కోట్లతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. మోతీలాల్ నగర్ వాసులకు చెప్పిన విధంగా వారి అండగా నిలిచామన్నారు. ఆటోనగర్ లో సౌకర్యాల నుంచి రోడ్ల నిర్మాణం వరకు ప్రతి అంశంలోనూ చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. అంజుమన్ స్కూల్ లో కేంద్ర మంత్రి పెమ్మసాని సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ తరగతి గదుల నిర్మాణం కోసం రూ.30 లక్షలు కేటాయించామని చెప్పారు. దీంతోపాటు మధ్యాహ్న భోజనం పథకం, సురక్షితమైన మంచి నీటి కోసం ఆర్వో ప్లాంట్, ఎన్సీసీ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, ఏపీఐఐసీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, భాష్యం రామకృష్ణ, తూర్పు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు రాఘవేంద్ర, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, టీడీపీ నాయకులు దాసరి రాజా మాస్టర్, చిట్టాబత్తుని చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, అబ్బూరి మల్లి , మరియు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి కళ్యాణ ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



- గట్టుపల్లి సుబ్రహ్మణ్యం దంపతుల వితరణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు హనుమంత్ జయంతి మరియు కళ్యాణం సందర్భంగా లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మారుతి వరప్రసాద్ మరియు కార్యనిర్వహణాధికారి వినయ్ లకు అందజేసిన స్థిరాస్తి వ్యాపారస్తులు వింధ్యశ్రీ ఇన్ఫ్రా స్ట్రక్చర్ చైర్మన్ గట్టుపల్లి సుబ్రహ్మణ్యం దంపతులు. చేబ్రోలు గ్రామంలో కోనేరు కొలువైయున్న ఆంజనేయ స్వామి దేవస్థానం లో గత రెండు రోజుల నుండి ఆంజనేయ స్వామి ఉత్సవాలు జరుగుతున్నాయి . సందర్భముగా సుబ్రహ్మణ్యం దంపతులు తన స్వగ్రామమైన చేబ్రోలులో జరుగుతున్న హనుమంత్ జయంతి , కళ్యాణం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఉత్సవ నిర్వహణలో భాగంగా ప్రసాదాల నిమిత్తం తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని కుటుంబ సమేతంగా నిర్వాహకులకు అందజేయడం సంతోషంగా ఉందని , గ్రామంలో జరిగే ఉత్సవాలు మరియు సాంస్కృతి కార్యక్రమాలు దైవ కార్యక్రమాల్లో అందరితో కలిసి జరుపుకోవడం మరింత సంతోషాన్ని కలగడమే కాకుండా , గ్రామస్తుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు మెరుగుపడతాయని అన్నారు.

# గుంటూరు బిఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ స్టేడియం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పరిధిలోని బిఆర్ స్టేడియంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను ఆగస్ట్ చివరికి పూర్తి చేసేలా రోజువారీ యాక్షన్ ప్లాన్ సిద్దం చేసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో బిఆర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారులు, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత స్టేడియంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ, బిఆర్ స్టేడియం పనుల వేగవంతంకు క్షేత్ర స్థాయిలో ఏ సమస్య లేనందున కాంట్రాక్టర్ తగిన కార్మికులు, సిబ్బందిని సిద్దం చేసుకొని వేగంగా చేయాలని, జిఎంసి నుండి పర్యవేక్షణకై ఈఈ, డిఈఈ, ఏఈలకు విధులు కేటాయించామన్నారు. అభివృద్ధి పనులు నిర్దేశిత డిజైన్ మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఆగస్ట్ చివరికి పూర్తి అయ్యేలా డిఎస్డీఓ, జిఎంసి అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష చేసి, తమకు నివేదిక ఇవ్వాలని ఈఈని ఆదేశించారు. సమావేశంలో జిఎంసి ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి మఠం హుండీ ఆదాయం 40 లక్షలు



- మేనేజర్ ఈశ్వరాచారి వెల్లడి
- 45రోజుల ఆదాయం 40 లక్షల 30 వేల 468 రూపాయలు
- 4 గ్రాముల బంగారు, 100 గ్రాములు వెండి
- గర్భాలయం మరియు పోలేరమ్మ హుండీలు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ప్రాంగణంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను రూపంగా హుండీలు లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ జిల్లాఅసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ సమక్షంలో ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షణలో భక్తుల మధ్య హుండీలను లెక్కింపు కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి ఏపీజివి బ్యాంకు సిబ్బంది చెన్నూరు భక్త బృందం ఆలయం సిబ్బంది పాల్గొన్నారు

# అన్నవరపులంకలో హనుమాన్ చాలీసా అష్టోత్తరశత పారాయణం

- గురువు నల్లపాటి వెంకటేశ్వరరావు



**అన్నవరపులంక (జర్నలిస్ట్ ఫైల్):** కొల్లిపర మండల పరిధిలోని అన్నవరపులంక కోదండ రామస్వామి వారి దేవస్థానం నందు హనుమాన్ చాలీసా అష్టోత్తర శత పారాయణం గురువు నల్లపాటి వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో స్థానిక సీతారామాంజనేయ భజన భక్త బృందం నేతృత్వంలో 108 పర్యాయములు నిర్వహించడం జరిగినది అనంతరం ప్రసాద వితరణ జరిగినది గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆనంద ఉత్సాహములతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ మహా పఠనమును నిర్వహించటం నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు హనుమాన్ చాలీసా పఠనం నందు నల్లపాటి దివ్యశ్రీ ,అందె తన్మయి , కళ్యాణం పార్థు ,అందె బాలచంద్రమౌళి , కళ్యాణం వెంకటేశ్వరరావు భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి నివారణకు పటిష్టమంతంగా ముందస్తు చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** డెంగ్యూ వ్యాధి నియంత్రణకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో డెంగ్యూ వ్యాధిపై అవగాహన పెంపొందించడం, దోమల నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, డ్రోన్ ల ద్వారా యాంటీ లార్వ చర్యలు, ఫాగింగ్, నిల్వ నీటిని తొలగించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డు స్థాయిలో ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఇంటింటి తనిఖీలు చేపట్టి దోమల పెరుగుదలకు కారణమయ్యే పరిస్థితులను గుర్తించి తక్షణ నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది డెంగ్యూ దినోత్సవం “తనిఖీ చేయండి--శుభ్రపరచండమూత పెట్టండి. అనే థీమ్‌తో నిర్వహించబడుతుందన్నారు. డెంగ్యూ వ్యాధి ఏడీస్ అనే దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, ఇవి ప్రధానంగా ఇళ్లలో నిల్వ ఉండే శుభ్రమైన నీటిలో పెరుగుతాయన్నారు. కావున ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో ఉన్న కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చెక్కలు, పాత టైర్లు, ఫ్రిజ్ ట్రేలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలను తనిఖీ చేసి శుభ్రం చేయాలని, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, బిందెలకు తప్పనిసరిగా మూతలు పెట్టాలని కోరారు. వ్యక్తిగత జాగ్రత్తల్లో భాగంగా పూర్తి చేతులకు దుస్తులు ధరించాలని, దోమతెరలు ఉపయోగించవచ్చని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, వైద్యుల సూచనలు లేకుండా స్వయంగా మందులు వాడకూడదని హెచ్చరించారు. ఈ దినోత్సవం సందర్భంగా వార్డు సచివాలయాల పరిధిలో అవగాహన ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# బ్రహ్మంగారిమఠాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తా

- మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని జింకలనగర్ లో రామాలయానికి భూమి పూజ చేశారు. టీటీడీ వారి 20 లక్షల నిధులతో ఈ రామాలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అలాగే సాయిబాబా గుడి కాలనీలో గత 13 ఏండ్ల క్రితం అప్పటి పాలకులు కోటి రూపాయల నిధులతో నీళ్లట్యాంకు నిర్మించి కేవలం రెండు లక్షల గల పనులను చేయలేక నిరుపయోగంగా ఇప్పటివరకు ఉందని ఆయన విమర్శించారు. ఈ విషయం స్థానిక మా నాయకులు నా దృష్టికి తేవడంతో వెంటనే బోరు, మోటారు వేసి ఈరోజు ప్రారంభించడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని జింకల నగర్ లోని ఎస్సీ కాలనీలోమినరల్ వాటర్ కోసం అన్ని బిగించుకొని కేవలం 60,70 వేల రూపాయలు లేక ప్లాంట్ అంతా నిరుపయోగంగా ఉందని స్థానిక నాయకుడు శ్రీనివాసుల రెడ్డి తెలపడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్లాంటును పరిశీలించి స్థానిక ఎంపీడీవోకు వెంటనే నిధులను మంజూరు చేయాలని ఆదేశించడం జరిగింది. అలాగే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడికి ప్రసాదం స్కీం కింద 162 కోట్లు మంజూరు అయిందని, దీంతో బ్రహ్మంగారి మఠశీ రూపు రేఖలు మారిపోతాయన్నారు. దీనికి స్థానిక మా నాయకులందరూ కూడా కలిసికట్టుగా ఉండి సహకరించాలని, వారందరితో కూడా నేను కలిసి మాట్లాడతానని ఆయన అన్నారు. అందరూ కూర్చొని సమావేశమై మఠం అభివృద్ధికి ఏమేమి చర్యలు తీసుకోవాలి ఎలా చేయాలి అనేదానిపై కూలంకుశంగా అందరితో చర్చిస్తామన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ భూములు అన్యక్రాంతమయ్యాయని ఒక నెలలో వాటికి పరిష్కార మార్గం చూపుతామన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించిన తర్వాత ఎవరైతే భూమిలేని వారు ఉన్నారో వారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. ఎవరికైనా చేయాలనే తపన ఉంటే ఏమైనా సాధించవచ్చని, అలా కాకుండా ఏమి పట్టించుకోకపోతే పనులు కూడా అలాగే నిలబడి పోతాయన్నారు. మండలంలో ఇంకా అభివృద్ధి పనుల కొరకు ఎంతో ప్రయత్నం చేస్తున్నానని, కేంద్రం నుంచి నిధులను తెప్పించి నవోదయ పాఠశాలను పూర్తి చేస్తానన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ తో వివరాలన్నీ తెలుసుకున్నారు. రెగ్యులర్ స్టాఫ్ నర్స్ లు లేరని చెప్పడంతో వెంటనే జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. అవసరమైతే కలెక్టర్ తో మాట్లాడి రెగ్యులర్ స్టాఫ్ నర్స్ లను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ముదుమాల పోలిరెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, టిడిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో డప్పుల భారత్ ప్రదర్శనకు భారీ ఏర్పాట్లు



- అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్త డప్పు కళాకారుల సమ్మేళనం

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న “డప్పుల భారత్ ప్రదర్శన” కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమ ముగింపు సభను విజయవంతంగా నిర్వహించేందుకు బీజేపీ రాష్ట్ర నేతలు విజయవాడ బందరు రోడ్డులోని అంబేద్కర్ భారీ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమం మే 17న సాయంత్రం 4 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శనగా కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా డప్పు కళాకారులు పాల్గొనే ఈ సమ్మేళనం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, రాష్ట్ర మంత్రి వై. సత్య కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్త డప్పు కళాకారుల సమ్మేళనం ఏర్పాట్లను పరిశీలించిన వారిలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉదయకుమార్, బసవరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్, శాంతకుమార్, అమర్లపూడి చిన్న, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సర్వసుద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ముండ్లపాటి చంద్రశేఖర్



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా ముండ్లపాటి చంద్రశేఖర్ గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా స్థానిక సోషల్ మీడియాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మీద వస్తున్న వార్తలకు స్వస్తి పలుకుతూ కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారు నాకు ప్రిన్సిపల్ గా బాధ్యతలు అప్పచెప్పారు కళాశాల కరస్పాండెంట్ ఆదేశాల మేరకు నేను నేటి నుండి కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరిస్తున్నానని నేటి నుండి నేను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీర్వచనములతో మీడియా మిత్రులు పెద్దల సహాయ సహకారాలతో బ్రహ్మంగారి మఠం మండల వ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు అందరికీ విజ్ఞప్తి చేస్తూ మా కళాశాల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా నియమ నిబంధనలు పాటిస్తూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం నా బాధ్యతని అంతేకాకుండా డిగ్రీ కళాశాల ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన కు అవకాశం కలిగేలాగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లతో మా కళాశాలను అనుసంధానం చేసుకొని ఇక్కడ చదివిన విద్యార్థులకు చదువు అయిపోగానే ఉద్యోగం పొందే లాగా కృషి చేస్తానని నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మండల ప్రజల సహాయ సహకారాలతో మీ అందరి సలహాలు తీసుకొని కళాశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

# జలధారలో 590 పనులు ప్రారంభం : జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జలధార - జల హారతి కార్యక్రమంలో జిల్లాలో ఇప్పటి వరకు 590 పనులు ప్రారంభం అయ్యాయని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 718 పనులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. వర్షాకాలం నాటికి అన్ని పనులు పూర్తి చేసి నీటిని నిలువ చేయుటకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని, భూగర్భ జలంగా మారాలని ఆయన అన్నారు. జిల్లాలో చెరువుల నీటి సామర్థ్యం మేరకు నీరు నిలవ జరగాల్సిందేనని అన్నారు. నీటి వనరులలోకి నీరు పారుదలకు ఏ ఆటంకం లేకుండా కాలువల్లో పూడికలు తీయాలని గట్లను బలోపేతం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులను చేపట్టడం జరుగుతుందని, సంబంధిత సిబ్బంది పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆయన చెప్పారు. ప్రతి చెరువు పూర్తి నీటి సామర్థ్యంతో నిండి ఉండడమే కాకుండా చుట్టుప్రక్కల ఆహ్లాదకర వాతావరణం ఉండే విధంగా చూడాలని సూచించారు. ప్రజలను పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని ఆయన తెలిపారు. నీటి వనరుల పరిరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ప్రతి మండలంలో చిన్న నీటి తరహా చెరువులు, వాటికి సంబంధించిన ఫీడర్ కాలువలను పునరుద్ధరించుటకు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గత ఆరు నెలల్లో భూగర్భ జలాలు, ప్రస్తుత భూగర్భ జలాలు విశ్లేషించి వంషపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న మండలాల్లో భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు జలధార జలహారతి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కాలువలపై ఆక్రమణలు, కాలువలు మూసుకుపోవడం, లేదా పంటలు వేసి వాటిని వినియోగించడం వంటి అంశాలు ఉంటే వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫీడర్ కాలువలను పూర్తిగా పునరుద్ధరించి భూగర్భ జలాలు పెంచాలని అన్నారు. గొలుసుకట్టు చెరువులపైనా శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే మంజూరు చేసిన పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని తద్వారా వర్షాలు కురిసే సమయంలో మంచి ఫలితాలు సాధించగలమని, అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రవాణా రంగానికి సహకారంతో పనిచేయాలి : మంత్రి రాంప్రసాద్ రెడ్డి



- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బస్ ఆపరేటర్స్ కార్యవర్గ సభ్యులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఏపీ బస్ ఆపరేటర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సమావేశం అనంతరం ప్రెసిడెంట్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ నాని, కార్యదర్శి రాంబాబు, ట్రెజరర్ సందీప్‌తో పాటు కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రవాణా రంగ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## అనుచిత వ్యాఖ్యలతో వైసీపీ మరింత దిగజారుతోంది



- బీజేపీ నేత తాడువాయి రామకృష్ణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల తీరు రోజురోజుకీ దిగజారిపోతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ విమర్శించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు గుంటూరు రేంజ్ పోలీసు ఉన్నతాధికారిపై, అలాగే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కూడా మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. ఒకప్పుడు 150కి పైగా అసెంబ్లీ స్థానాలను ప్రజలు కట్టబెట్టినా, సమర్థవంతమైన పాలన అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా హుందాతనాన్ని పాటించకుండా విమర్శల పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోందన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి, మహిళలు, ప్రజలు, గుంటూరు రేంజ్ ఉన్నతాధికారిపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని తాడువాయి రామకృష్ణ పేర్కొన్నారు. ప్రజలను కావాలనే రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడుతున్నారని, ఇటువంటి వ్యవహార శైలే వైసీపీ ప్రజాదరణ రోజురోజుకీ తగ్గిపోవడానికి కారణమని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో హుందాతనం, ప్రజాస్వామ్య విలువలు పాటించడం ప్రతి నాయకుడి బాధ్యత అని, వ్యక్తిగత విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడాలని ఆయన సూచించారు.

## జనగణన పూర్తయ్యే వరకు ఇతర విధులు వద్దు

- సెన్సస్ డైరెక్టర్‌కు గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వినతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తయ్యే మే 31వ తేదీ వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగులకు ఇతర శాఖల పనుల నుంచి విముక్తి కల్పించాలని, అలాగే బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెన్సస్ డైరెక్టర్‌ను కోరింది.
ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.
సెన్సస్-2027 హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా అనేకమంది ఉద్యోగులకు వారు విధులు నిర్వహిస్తున్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధికి భిన్నమైన ప్రాంతాల్లో జనగణన విధులు కేటాయించినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఈ కారణంగా బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడం అత్యవసరమని పేర్కొన్నారు. సెన్సస్ మార్గదర్శకాల ప్రకారం ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల పనిదినాలు వారి కార్యాలయాల్లో సాధారణ పనిదినాలుగానే పరిగణించబడతాయని, అందువల్ల వారు పూర్తి సమయాన్ని జనగణన విధులకే కేటాయించాల్సిన అవసరం ఉందని వివరించారు. అయితే ప్రస్తుతం సెన్సస్ విధులతో పాటు ఇతర శాఖల పనులు, అత్యవసరం కాని కార్యక్రమాలు, వివిధ ఇంటింటి సర్వేలు కూడా అప్పగించడం వల్ల ఉద్యోగులపై తీవ్ర పనిభారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర ఎండల పరిస్థితుల్లో ఇంటింటికీ వెళ్లి సమాచార సేకరణ చేయాల్సి రావడంతో ఫీల్డ్ స్థాయి సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సెన్సస్ పనులతో పాటు ఇతర బాధ్యతలు నిర్వహించాల్సి రావడం వల్ల జనగణన పనితీరు దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సెన్సస్ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగులను ఇతర పనుల నుంచి పూర్తిగా విముక్తి కల్పించి, జనగణన పనులపైనే దృష్టి సారించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని ఫెడరేషన్ నాయకులు సెన్సస్ డైరెక్టర్‌ను కోరారు. ఈ చర్యల ద్వారా సెన్సస్ ప్రక్రియ మరింత సమర్థవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తవుతుందని, అలాగే ఉద్యోగుల సంక్షేమం కూడా కాపాడబడుతుందని జాని పాషా, అంకమ్మరావు తెలిపారు.

## నిండు ప్రాణాన్ని కాపాడిన బి మఠం పోలీసులు




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్)**: జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం సమీపంలోని బ్రహ్మంగారిమఠం బ్రహ్మ సాగర్ రిజర్వాయర్లో ఆళ్లగడ్డకు చెందిన షేక్ సైదా బి అనే మహిళ ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో రిజర్వాయర్లో దూకి చనిపోవాలని గురువారం ఉదయం 6.30 కి వెళ్లగా వెంటనే బ్రహ్మంగారిమఠం సబ్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్కి సమాచారం రావడంతో బ్రహ్మంగారిమఠం పోలీస్ ఏఎస్ఐ సుధాకర్ గారు మరియు డ్యూటీ లో ఉన్న పోలీసు సిబ్బంది అయిన నరసింహారెడ్డి నాగరాజు రిజర్వాయర్ వద్దకు చేరుకొని ఆమెను కాపాడి వారి భర్త అయిన షేక్ మాలిక్ భాష కు అప్పగించడమైనది. మానసిక స్థితి సరిగా లేక రిజర్వాయర్ దూకడానికి వెళ్లిన ఆమెను కాపాడిన బ్రహ్మం గారి మఠం పోలీసువారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# గుంటూరు జీజీహెచ్‌కు రూ.30 కోట్లతో మరో లినాక్ రేడియేషన్ మెషిన్

- పెట్ స్కాన్ రాకతో లెవల్-1 స్థాయికి చేరిన గుంటూరు జీజీహెచ్
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి
- క్యాన్సర్ వైద్య సేవల మెరుగుకు, మరణాలు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కృషి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు సర్వజన ఆసుపత్రిలోని 'నాట్కో క్యాన్సర్ సెంటర్' లెవల్-1 స్థాయికి చేరిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం మంజూరుచేసిన రూ. 18 కోట్లతో క్యాన్సర్ వ్యాధి చికిత్సలో అత్యంత కీలకంగా వ్యవహరించే 'పెట్ స్కాన్" సేవలను వీరువురు గురువారం గుంటూరు జీజీహెచ్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జీసీ వారి దాతృత్వాన్ని ప్రదర్శించి రూ. 30 కోట్ల విలువచేసే 'లినాక్ మెషిన్"ను విరాళం కింద అందచేసేందుకు ముందుకు వచ్చారని వెల్లడించారు. రోగుల అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఉన్న ఒక లినాక్ మెషిన్ కు అదనంగా రెండో లినాక్ రేడియేషన్ మెషిన్ ను అందచేసేందుకు ముందుకు వచ్చిన ఓఎన్జీసీ వారికి కృతజ్ఞతలు తెలిపారు నాట్కో ట్రస్టు వారి దాతృత్వంతో క్యాన్సర్ చికిత్స కోసం అన్ని రకాల వసతులతో భవనాన్ని నిర్మించగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 41 కోట్లతో పేద క్యాన్సర్ రోగుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక యంత్రాలు/ పరికరాలు సమకూర్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలిసారి గా గుంటూరు జీజీహెచ్లోనే పెట్ స్కాన్ సౌకర్యం ఏర్పడిందని తెలిపారు.

**రెండేళ్లలో అదనంగా 800 పడకలు** : కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు గుంటూరు జీజీహెచ్లో అన్ని రకాలుగా కలిపి 800 పడకలు అదనంగా సమకూరాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. రూ. 140 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు అత్యాధునిక ఎంసీహెచ్ బ్లాక్ ను నిర్మించారన్నారు. తన విజ్ఞప్తిని పరిగణనలోనికి తీసుకుని ఓఎన్ జీసీ వారు 'సీఎస్ఆర్ " కింద రూ. 30 కోట్లతో లినాక్ మిషను అందచేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పెట్ స్కాన్ వంటి అత్యాధునిక యంత్రాలు/ పరికరాలు సమకూర్చేందుకు నిధులు సమకూర్చడంపట్ల హర్షంవ్యక్తంచేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ మాట్లాడుతూ నాట్కో క్యాన్సర్ కేంద్రం అభివృద్ధిలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ చొరవ స్ఫూర్తిదాయకమన్నారు.

**క్యాన్సర్ కేసులు తగ్గించేందుకు తగ్గించేందుకు..** : ప్రపంచ వ్యాప్తంగా 17.20% మరణాలు క్యాన్సర్ వ్యాధితో జరుగుతుంటే ఇందులో 9.93% మరణాలు దేశంల జరుగుతున్నాయని మంత్రి సతీష్‌కుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు క్యాన్సర్ మరణాలు తగ్గించేందుకు, ఉన్నత వైద్యాన్ని అందుబాటులోనికి తెచ్చేందుక అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్సీడీ-04 కింద (నాన్ కమ్యూనికబుల్ డీసెజస్) సర్వేచేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేసుల గుర్తింపునకు సంబంధించి స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. 2.33 కోట్ల మందికి ఓరల్, 121 కోట్ల మంది మహిళలకు సర్వైకల్ స్క్రీనింగ్ జరిగిందని పేర్కొన్నారు. 70% క్యాన్సర్ జబ్బులను ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చునన్నారు.

**కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ రూ.120 కోట్లతో అభివృద్ధి!** : కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ను రూ. 120 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ. 90 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి చర్యలు పూర్తయ్యాయన్నార కడప, వైజాగ్ లోని క్యాన్సర్ సెంటర్లను కాంప్రహెన్సివ్ సెంటర్లగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మలివిడత కింద (ఫేస్-2) అనంతపురం, కాకినాడలో ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ వైద్య సేవలను మరింత పటిష్టం చేసేందుకు అత్యాధునిక పరికరాలు (లినాక్, సీటీ స్టిమ్యూలేటర్, హెచ్ఎఆర్ బ్రాకీ, ఇతర ) సమకూరుస్తామని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

**వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం క్యాథలాబ్స్, ఎమ్మారైలు, సిటీ స్కాన్లు** : వ్యాధుల నిర్ధారణలో కీలకంగా వ్యవహరించే యంత్రాలు, పరికరాలను ఆసుపత్రుల్లో సమకూర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వాసుపత్రుల్లో మూడు క్యాథ్స్ ల్యాబ్స్, ఆరు సీటీ స్కాన్లను కూటమి ప్రభుత్వం సమకూర్చిందన్నారు. మరోకటి పిడుగురాళ్లలోని బోధనాసుపత్రిల రాబోతుందన్నారు. ఇవికాకుండా ఏడు ఎమ్మారైలను కూడా ఆసుపత్రుల్లో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పెట్ స్కాన్ వైద్య సేవల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాజంనేయులు, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రాధికారెడ్డి, గుంటూరు సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దాతృత్వానికి దక్కిన గౌరవం : 50 ఏళ్ల నిరీక్షణకు తెర

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో నెరవేరిన దాత కుటుంబ ఆశయం
- కోయ్యాన అప్పారావు జ్ఞాపకార్థం 'మెమోరియల్ ట్రస్ట్'గా నామకరణం
- కోయ్యాన అప్పారావు మెమోరియల్ ట్రస్ట్" గా మారుస్తూ ప్రభుత్వం అధికారిక జీవో జారీ
- ధర్మాన ప్రసాదరావు... చేయ లేని పని
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో సఫలీకృతం



**శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్)** : దాతలు భూమిని ఇస్తే, వారి త్యాగాన్ని పదికాలాల పాటు గుర్తుంచుకోవడం ప్రభుత్వాల బాధ్యత. కానీ, ఆ గౌరవం దక్కడానికి ఒక కుటుంబం ఏకంగా ఐదు దశాబ్దాల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. 1972లో జరిగిన ఆ మహా దానానికి ఎట్టకేలకు ఇప్పుడు గుర్తింపు లభించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో, దశాబ్దాలుగా ఫైళ్లకే పరిమితమైన సమస్య కొలిక్కి వచ్చింది. 1972వ సంవత్సరంలో సామాజిక ప్రయోజనం కోసం కోయ్యాన అప్పారావు తనకున్న అత్యంత విలువైన 1.40 ఎకరాల భూమిని ప్రభుత్వానికి (సెంట్రలైజ్డ్ సెమెన్ కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు) ఉచితంగా అందజేశారు. 1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, ఆ స్థలానికి దాత పేరు పెట్టాలన్న ప్రతిపాదన మాత్రం గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది. తమ పూర్వీకుల త్యాగానికి గుర్తింపు దక్కకపోవడంపై వారి కుటుంబ సభ్యులు దశాబ్దాలుగా ఆవేదన చెందుతూనే ఉన్నారు.

**ఫైళ్ల దుమ్ము దులిపిన మంత్రి అచ్చెన్న..** : ఈ విషయం మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి రాగానే ఆయన యుద్ధప్రాతిపదికన స్పందించారు. 50 ఏళ్ల నాటి పాత రికార్డులను, పత్రాలను అధికారుల ద్వారా తెప్పించి స్వయంగా పరిశీలించారు. అప్పారావు గారి త్యాగం సామాన్యమైనది కాదని, అటువంటి వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని భావించి, వెంటనే సంబంధిత శాఖలతో చర్చించారు. మంత్రి పట్టుదలతో ఆ కేంద్రాన్ని "కోయ్యాన అప్పారావు మెమోరియల్ ట్రస్ట్" గా మారుస్తూ ప్రభుత్వం అధికారిక జీవో జారీ చేసింది. తమ తాతల నాటి కల నేడు నెరవేరడంతో అప్పారావు వారసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి చేసిన జరగని పనిని చివరకు 50 ఏళ్ల నాటి సమస్యను రోజుల వ్యవధిలో పరిష్కరించి, తమ కుటుంబానికి గౌరవాన్ని తెచ్చిపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. "మాట ఇస్తే తప్పని నాయకుడు మంత్రి అచ్చెన్నాయుడు అని ఈ ఘటన మరోసారి నిరూపించింది" అని స్థానికులు కొనియాడుతున్నారు.

## పర్యాటక రంగంలో భారత్-అమెరికా బంధం బలోపేతం: మంత్రి కందుల దుర్గేష్



- ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ తో 'యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ
- ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇటువంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని మంత్రి దుర్గేష్ ప్రకటన
- భారత్-అమెరికా 75 ఏళ్ల మైత్రిపై మంత్రి దుర్గేష్‌కి ప్రత్యేక పుస్తకం అందజేత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇందులో భాగంగా భారత్ మరియు అమెరికా దేశాల మధ్య పర్యాటక బంధాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ ప్రతినిధులు గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధి కోసం మంత్రి కందుల దుర్గేష్ తీసుకువచ్చిన నూతన సంస్కరణలు, పాలసీలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఈ పురోగతిని అమెరికాలోని ప్రముఖ ఇన్వెస్టర్లకు వివరించి, ఏపీకి పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. గత 75 ఏళ్లుగా భారత్-అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న దౌత్య, వాణిజ్య బంధం మరియు సాధించిన విజయాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని మంత్రి దుర్గేష్ కి బహూకరించారు. ఇరు దేశాల మధ్య పర్యాటక రాకపోకలను పెంచడం, సాంస్కృతిక మార్పిడి మరియు హాస్పిటాలిటీ రంగంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రతినిధులకు వివరించిన మంత్రి దుర్గేష్ విదేశీ పెట్టుబడులకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇటువంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. మంత్రి దుర్గేష్‌ను కలిసిన వారిలో యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ సీనియర్ డైరెక్టర్ ఆస్టిక్ సిన్హా, టూరిజం అండ్ హాస్పిటాలిటీ వింగ్ హెడ్ దివ్ ద్రిష్టి సింగ్ ఉన్నారు.

## రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం - ఎంఎస్‌పీ పెంపుతో రైతులకు భారీ ఊరట

- భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: గుంటూరు: కేంద్ర ప్రభుత్వం 2026-27 మార్కెటింగ్ సీజన్‌కు గాను వివిధ ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలు (MSP) పెంచడం పట్ల భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వై.వి. సుబ్బారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పెంపు రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, పంటల సాగుపై రైతుల్లో మరింత నమ్మకాన్ని పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వరి, జొన్న, రాగులు, సజ్జలు, పప్పుధాన్యాలు, నువ్వులు, పత్తి వంటి పంటలకు గణనీయమైన మద్దతు ధరలు ప్రకటించడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని సుబ్బారావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా రైతుల సంక్షేమం కోసం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర మాత్రమే కాకుండా, పిఎం-కిసాన్, పీఎం- ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డ్స్, ఈ-నామ్, పీఎం-కృషి సించాయ్ యోజన వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారని సుబ్బారావు పేర్కొన్నారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు నిజంగా అందాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని, మధ్యవర్తుల దోపిడీని అరికట్టాలని, ప్రతి రైతు నుండి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడటంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అధిక లాభదాయకత కలిగిన పంటల సాగుపై దృష్టి పెట్టాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారతదేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, రైతు సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు స్పష్టం చేశారు.

# దేశ ఆర్థికాభివృద్ధికి స్టాక్ మార్కెట్లే చోదక శక్తి

- విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా స్టూడెంట్ స్కిల్లింగ్ అండ్ ఇన్వెస్టర్ అవేర్‌నెస్ కార్యక్రమం
- ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**: దేశ ఆర్థికాభివృద్ధిలో స్టాక్ మార్కెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఎన్ఎస్ఈ, సెబీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్టూడెంట్ స్కిల్లింగ్ అండ్ ఇన్వెస్టర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1994లో దేశంలో కేవలం 10 నుంచి 15 లక్షల మంది పెట్టుబడిదారులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 13 కోట్లకు చేరిందన్నారు. అప్పట్లో భారత స్టాక్ మార్కెట్ మొత్తం విలువ రూ. 3.8 లక్షల కోట్లు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది రూ. 470 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం అమెరికా, చైనా, జపాన్ తర్వాత భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా నిలిచిందన్నారు. విజ్ఞాన్స్ వర్సిటీలో ప్రత్యేకంగా ఎన్ఎస్ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముంబైలోని ఎన్ఎస్ఈ నిపుణుల ద్వారా విద్యార్థులకు ట్రేడింగ్, ఫైనాన్షియల్ మార్కెట్లు, పెట్టుబడులు, ఈక్విటీ రీసెర్చ్‌పై శిక్షణ అందిస్తామని తెలిపారు. చిన్న స్థాయి వ్యాపారవేత్తలు కూడా ఎన్ఎస్ఈ ద్వారా నిధులు సమీకరించుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎన్ఎస్ఈ ఎమర్జ్ వేదిక ద్వారా స్టార్టప్‌లు, చిన్న కంపెనీలు ఈక్విటీ రూపంలో పెట్టుబడులు పొందవచ్చన్నారు. యువ పారిశ్రామికవేత్తలు స్టాక్ మార్కెట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
మనుషులు మాత్రమే భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేస్తారని, ఆ పొదుపులను ఉత్పాదక పెట్టుబడులుగా మార్చడం ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కీలకమని చెప్పారు. బ్యాంకుల ద్వారా జరిగే ఆర్థిక మధ్యవర్తిత్వం, స్టాక్ మార్కెట్ల ద్వారా జరిగే నేరుగా పెట్టుబడుల విధానం గురించి ఆయన వివరించారు. 1991 ఆర్థిక సంక్షోభం తర్వాత దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయని తెలిపారు. 1992 హర్షద్ మెహతా కుంభకోణం తర్వాత పారదర్శకమైన, సమర్థవంతమైన స్టాక్ ఎక్స్చేంజ్ అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలోనే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఏర్పాటైందని చెప్పారు. ఐఐటీ బాంబేలో మెకానికల్ ఇంజనీరింగ్, ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ పూర్తి చేసిన అనంతరం ఐడిబిఐలో చేరిన తాను, కేవలం ఏడాది అనుభవంతో ఎన్ఎస్ఈ నిర్మాణ బృందంలో పనిచేసిన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అప్పట్లో సరైన టెలికమ్యూనికేషన్ సదుపాయాలు కూడా లేని పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా కంప్యూటరైజ్డ్ ట్రేడింగ్ వ్యవస్థను రూపొందించడం పెద్ద సవాలుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సెబీ కార్పొరేట్ ఫైనాన్స్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ డీ. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల నమ్మకమే ఆర్థిక వ్యవస్థకు బలమన్నారు. డిజిటల్ యుగంలో పెట్టుబడులు పెట్టడం సులభమైనప్పటికీ, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫేక్ ట్రేడింగ్ సలహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెబీ అనుమతి లేని సంస్థల్లో పెట్టుబడులు పెట్టొద్దని హెచ్చరించారు. అధిక లాభాల ఆశతో ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరమన్నారు. పెట్టుబడిదారులు తమ ఆదాయం, రిస్క్ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పెట్టుబడులు పెట్టాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, మార్కెట్ ధోరణులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467